POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
ఏప్రిల్ 2023
వెల – ₹ 10.00

సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 40 సంచిక: 12

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహరాజ్ ఆరాధనా మహోత్సవము
(12-04-2023)

ఈ నెల పండుగలు

ఏప్రిల్ 12 - శ్రీ సాయి మాస్టర్ ఆరాధన
ఏప్రిల్ 14 - భగవాన్ రమణ మహర్షి ఆరాధన
ఏప్రిల్ 18 - శ్రీ స్వామి సమర్థ ఆరాధన (తిథి - చైత్ర బహుళ త్రయోదశి)
ఏప్రిల్ 30 - శ్రీ ఆనందమయి మాత జయంతి

"నిజమైన సాధకుడు తన జీవితాన్నంతా సాధన కనుకూలంగా మలచుకుంటాడు. అంటే తన సాధనకు అడ్డురాని ఉద్యోగం, స్నేహితులు, జీవిత విధానం, దినచర్య అన్నీ – తను వేసే ప్రతి అడుగు – తన గమ్యం వైపే వేస్తాడు. తను దేనికోసం జీవితాన్ని గడుపుతున్నాడో దానికోసం సర్వాన్నీ వదిలిపెట్టడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా వుంటాడు. అలాకాక రోజూ సక్రమంగా ధ్యానం చెయ్యడానికి వీలు లేదనో, టైం దొరకటము లేదనో, తాము జీవితంలో పూర్తి చేయవలయుననుకొన్న పనులు కొన్ని పూర్తి చేసి సాధన చేస్తామనో, జీవితం బాగా అనుభవించి (ఇక అనుభవింపయోగ్యం గాని ముసలి వయస్సులో) బాగా సాధన చేస్తామనో అనేవాళ్ళకు అసలు సాధన అంటే యింకా తెలియలేదన్నమాట.

అసలు మానవుడు వుండేదే దేవుడవడం కోసం – విత్తు వుండేది చెట్టవడం కోసమయినట్లు. కాబట్టి 'సాధనలో జీవితం ఒక భాగమవ్వాలి' అని తెలుసుకొని తీరాలి. ఇది తెలుసుకొనకుండా, సాధించకుండా, ఈ లోపల 'సాధన, ముక్తి' అని మాట్లాడడం చిన్న పిల్లవాడి మాటలవలె అర్థరహితం. ఇది సాధిస్తేనే సాధన మొదలైనట్లు."

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

కొత్త యుగానికి కొత్త మతం

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రపంచంలో ఎన్నో మతాలు, ఆధ్యాత్మ సంప్రదాయాలు మానవ మనుగడకని వెలిశాయి. కానీ కాలాంతరంలో అవి శిథిలమయ్యాయి. సాంప్రదాయ బాహ్యమైన అంశాలెన్నో ఆచారాలుగాను, సాంప్రదాయాలకు విభిన్న వ్యాఖ్యానాల రూపంలోనూ అందులో చొచ్చుకుని సత్యమైన పథం మరుగుపడినది. ప్రతి మతంలోనూ మతాంతరాలు, వాటి మధ్య విభేదాలు, చీలికలు ఏర్పడ్డాయి. కాలగతిలో ఇది అనివార్యం. మతేతరమైన సిద్ధాంతాలకు కూడా ఈ విభేదం తప్పడం లేదు. కార్ల్-మార్క్స్ సిద్ధాంతానికి రష్యా ఒక వ్యాఖ్యానాన్ని ఇస్తే, జెకోస్లోవేకియా మరొక వ్యాఖ్యానాన్నిచ్చింది. మావో కాలపు చైనా, క్యూబా, అర్జెంటీనా, హంగరీలు వేరువేరు పంథాలుగా ఈ సిద్ధాంతాన్నే ఏర్పరుచుకున్నాయి. మతాల విషయంలో కాలగతి ఎక్కువైంది గనుక ఈ మార్పుల వైవిధ్యము, మాలిన్యము మరీ ఎక్కువయ్యాయి. దీన్నే భగవద్గీత ధర్మగ్లాని అని చెప్పి, అట్టి సమయాలలో దైవమే అవతరించి తిరిగి పరిశుద్ధ మూలధర్మాన్ని ఉద్ధరిస్తాడని కూడా చెబుతుంది. ఈ విషయాన్నే చరిత్రలో – అనేకమంది బుద్ధులవతరించడంగా బౌద్ధము, తీర్థంకరులు అవతరించడంగా జైనము చెప్పాయి. బైబిల్ లో ఏసుక్రీస్తు ప్రాచీన ధర్మాలను పరిపూర్తి గావించడానికి, అంటే ఆచరణలో వాటి పూర్ణత్వాన్ని ప్రకటించడానికి తాను అవతరించినట్లు చెప్పారు. దీనిని గురించే ఖురాన్ షరీఫ్ లో 'అల్లా ఎందరో ప్రవక్తలను వివిధ కాలాల్లో వివిధ దేశస్థుల మధ్యకు పంపారని; వారందరూ ప్రకటించింది ఒకే సత్యమైన పథమని, కానీ కాలాంతరంలో ఆయా ధర్మాలు శిథిలం చెందాయని తిరిగి ఆ సనాతన ధర్మమే మరల ఖురాన్ ద్వారా మానవాళికి వెల్లడిస్తున్నామని' అన్నట్లు వ్రాయబడింది. ఈ విషయం మన ప్రాచీన ధర్మశాస్త్రాల్లో 'ధర్మాచరణ విషయంలో శంక కలిగితే సర్వజ్ఞులైన మహనీయుల నడవడే మార్గదర్శకమని' స్పష్టంగా చెప్పబడ్డది. పరిపూర్ణులైన మహనీయుల అవతరణ ప్రయోజనాలలో ముఖ్యాతి ముఖ్యమైనదిదే! మృతప్రాయమైన మూఢాచరణను పరిశుద్ధమొనర్చి, దానినాచరించి సజీవమొనర్చి తిరిగి ప్రజల ఆచరణలో దానిని స్థాపించడమే!

చిరకాలం నిలచియుండాలంటే ఆధ్యాత్మికత కేవలం వ్యక్తిగతమైన భక్తిగా మాత్రముండక ఒక నిర్దుష్టమైన సిద్ధాంతంగా రూపొందాలి. ఇందులో ఎంతటి మహనీయులైనా వారి వ్యక్తిత్వాలకు ప్రాధాన్యముండరాదు. ఉదాహరణకు వేదాలు, ఉపనిషత్తులూ చెప్పిన శాశ్వత సత్యాలు ప్రధానం గాని వాటిని ప్రకటించిన ఋషుల వ్యక్తిగతమైన ఔన్నత్యం గాదు. అందుకే సనాతన ధర్మానికి మూలపురుషుడంటూ ఎవరూ లేరు. ఉపనిషత్తులలో సూచించిన ధర్మాన్నెవరాచరించినా ఆయా ఋషులను పూజించకున్నా ఫలితం అనాదిగా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:40 ఏప్రిల్-2023 సంచిక:12

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

విషయ సూచిక

01.	**కొత్త యుగానికి కొత్త మతం**	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	03
02.	**పరిప్రశ్న**	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	06
03.	**ఆచార్యుని అద్భుత బోధలు**	పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ	07
04.	**మాతృదేవి స్మృతులు**	శ్రీ శ్రీధర్	10
05.	**వార్తాలాపము**	శ్రీమతి అడిదం వేదవతి	12
06.	**శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు**	శ్రీమతి శ్రీదేవి	14
07.	**దివ్య సన్నిధానములో జగత్కల్యాణ వేడుకలు!!**	శ్రీమతి టి. పద్మావతి	17
08.	**మార్గం చూపిన మహనీయుడు**	శ్రీమతి సరోజనమ్మ	20
09.	**మరికొందరు భక్తులు**	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	22
10.	**ద్వారకామాయి అనుభవమండపము**	శ్రీ జగదీష్ మురారి	25
11.	**ఆచార్యుని అద్భుత లీలలు**	శ్రీమతి భార్గవి	28

చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

www.saibharadwaja.org
www.saimasterforums.org

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి	:	రూ. 10-00
సంవత్సర చందా	:	రూ. 100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

ఎందరికో కల్గుతూవచ్చింది. కేవలం కలిప్రభావం వలన అందుకు మానవు లశక్తులవుతారు గనుక వారికొక వంక పూజించుకొనడానికి అవతార పురుషులనూ, మరొకవంక స్థూలమైన దేవతామూర్తులను అందజేశారు ఋషులు. ఇప్పుడు కలిప్రభావ మింకా ముదిరి ఆధునిక ప్రపంచ పరిస్థితుల వలన యీ రెంటినీ విశ్వసించే శక్తి వ్యక్తులలో ఒకవంక కుంటుపడుతున్నది. మరొకవంక నేటి విజ్ఞానప్రభావం వలన బుద్ధిశక్తి వృద్ధి చెందుతున్నది. అందుకని మరలా ఆధ్యాత్మవిద్య సమైక్యం కాగల ఒక నిర్దుష్టమైన సిద్ధాంతంగా రూపొందాలని, యిందులో వ్యక్తిగత ఆధిక్యతలకు తావుండకూడదని సాయి హెచ్చరిక.

వైజ్ఞానిక, సాంఘిక, రాజకీయ రంగాలలో గూడ యిట్టి మార్పే కన్పిస్తుంది. వైజ్ఞానిక రంగంలో కనుగొనబడిన సిద్ధాంతము సరైనదా, కాదా – అన్నదే ప్రధానం గాని ఆ శాస్త్రజ్ఞుడి కెట్టి ప్రాధాన్యమూ వుండదు: ఉన్న కొద్ది మాత్రం గూడ ఆ సిద్ధాంతం సత్యంగావడం వల్లనే వుంటుంది. రాజకీయ, ఆర్థిక, సాంఘిక, రంగాలలో చూస్తే ఉదాహరణకు మార్క్సు, లెనిన్ల వ్యక్తిత్వానికేమీ విలువుండదు. విలువంతా వారి సిద్ధాంతానిదే. దాన్ని దర్శించి ప్రవచించడం వల్లనే వారి కంత మాత్రమైనా గుర్తింపు వుండేది.

ఈ యుగానికి తగిన యీ మార్పునే సాయి ఆధ్యాత్మిక రంగంలోకి తెస్తున్నారు. సద్గురువును ముముక్షువులాశ్రయించి తీరాలనీ, వారిని గుర్తించి, సేవించి అనుగ్రహం పొందడానికి శ్రీ గురుచరిత్ర పారాయణ చేయాలని, మిగిలిన అంశాలలో సాయిబాబా జీవితచరిత్ర పారాయణ సహాయంతో సర్వులూ సంఘటితం గావాలన్నది యీ సనాతన నూత్న ఆధ్యాత్మ సిద్ధాంతం.

ఇక మరొక సూత్రం, ఎందరో మహనీయులుద్భవించారు.... ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క మహాత్మునిపై భక్తి ఉప్పెనలా ప్రజానీకాన్ని ఊపి, కొద్దికాలం తర్వాత పాలపొంగులా అణగిపోవడం, మరికొద్ది కాలానికి మరొక మహాత్మునిపై భక్తి ప్రజల నుర్రూతలూగించడమూ జరిగింది. ఈ మహనీయుల భక్తి ప్రజలలో యింత స్వల్పకాలం మాత్రమే బలీయంగా కొనసాగడానికి కారణం? కాని మరొకవంక రాముడు, కృష్ణుడి విషయమలాగాదు. ఎన్ని వేల సం॥ల క్రిందట వారవతరించారో, రామాయణ, భారత, భాగవతాలు వ్రాయబడ్డాయో! అయినా యీనాటికీ మన దేశంలో ఎంత చదువుకోనివారికైనా వారి సంగతి తెలుసు; వారిపై భక్తిశ్రద్ధలు కొనసాగిస్తున్నారు. ఇందుకు కారణం? వాల్మీకి, వ్యాసుడుగూడ యీ భగవదవతారాలను పూజించమనీ, వారి నామస్మరణ చేస్తే చాలుననీ చెప్పలేదు. సార్థకంగా ప్రజలలా చేయగల్గాలంటే వారి హృదయాలలో ఆ అవతారమూర్తులపై ఎంతో భక్తి విశ్వాసాలుండాలి. అందువలన అన్నివేల శ్లోకాలు గల సుదీర్ఘమైన రామాయణ, భారత, భాగవతాలు వ్రాసి, వారి శిష్య ప్రశిష్యులద్వారా దేశమంతటా ఆసేతు హిమాచల పర్యంతము ప్రజలందరిచేతా తరతరాలుగా ఆ దివ్యమూర్తుల లీలా శ్రవణం చేయించారు. అలా చేయడం మన సాంప్రదాయంలో ప్రధానాంశమయ్యేలా చేశారు.

ఈనాడు సాయిబాబా జీవిత చరిత్రను, గురుచరిత్రను అలానే మనం తరతరాల వారిచేత శ్రవణము. పారాయణమూ చేయించి సిద్ధాంతపరమైన ఆధ్యాత్మ బోధను ప్రజల హృదయాలలో తరతరాలు నాటుకొనేలా చేయాలని సాయిబోధ. అది మనకు తెల్పడానికే. ఆయన ప్రత్యక్షభక్తుడైన దాసగణుచేత హరికథాగానం చేయించారు. హేమాద్పంతుచేత, శ్రీ బి. వి. నరసింహస్వామి, శ్రీ బాపట్ల హనుమంతరావు పంతులు గార్లచేత చరిత్ర రచనా ప్రచారం చేయించారు. ఇంకా చేయిస్తున్నారు. అంటే అటు వైదిక విధానాన్ని అనుసరించి ఆధ్యాత్మికతను నిర్దుష్టమైన, వ్యక్తి ప్రాధాన్యంలేని సిద్ధాంతంగా రూపొందిస్తున్నారు. మరొకవంక పురాణేతిహాసాల పద్ధతిననుసరించి కలకాలం యీ సంప్రదాయం కొనసాగే పద్ధతిని అనుసరింపజేస్తున్నారు.

పూర్వం బౌద్ధంలోను, ఇస్లాంలోనూ, యిట్టి ప్రయత్నం జరిగింది. బౌద్ధంలో బుద్ధుని పూజించడానికి ప్రాధాన్యమే లేదు. ఇస్లాంలో మహమ్మదుల వారిని దైవ స్వరూపంగా పూజించటం అంగీకరించరు. ఆయా మహనీయుల ద్వారా ప్రకటమైన మహత్తరమైన జీవిత విధాన మాచరించడమే ప్రధానం. అందుకే ఆ రెండు ధర్మాలూ యీ యుగంలో అంతబలీయమై ప్రపంచంలో ఎన్ని దేశాలలోనో దృఢంగా నాటుకుపోయాయి. దానినే సాయినాథుడు మరలా

మిగతా 24వ పేజీలో

పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రశ్న :-మంచి తులసిమాల ఉపయోగించాలంటారు వైష్ణవులు. ఒకసారి మెడలో ధరిస్తే తిరిగి దానిని జపానికి వాడకూడదంటారెందుకు? మంచిమాల ఎక్కడ దొరుకుతుంది?

-శ్రీమతి ఎన్. సి. లక్ష్మీదేవి, బెంగుళూరు

జవాబు :-సృష్టి మొత్తమూ త్రిగుణాత్మకము. కనుక వస్తువులు, ప్రాణులు కూడ సత్వ రజస్తమో గుణాలలో ఒకదానిని ప్రధానంగా కల్గివుంటాయి.

మొక్కలలో సత్వప్రధానమయిన వాటిలో తులసి ఒకటి. ఈ సత్వగుణమన్నది ఆ మొక్కకు మన దేహధాతువులపై, మనస్సు పైన ఒక విశిష్టమైన ప్రభావముంటుంది. ఇది స్పర్శ, దర్శన, వాసనల ద్వారా కూడా పనిచేస్తుంది. కనుక తులసిమాలను ఉపయోగించడం ఒక గొప్ప సహకారి, జపంలో మనసు చలించినప్పుడు దానిని వెనుకకు లాక్కోడానికి కనీసం కొంత పరిమిత జపకాలంలోనైనా మనస్సు ధ్యేయంమీద ఏకాగ్రం కావడానికి మాల, జపసంఖ్య ఉపయోగపడతాయి. కొలికిపూస లేక మేరువును జపంలో దాటిపోగూడదన్న నిబంధన జపాన్ని యాంత్రికమవనివ్వకుండా, మన శ్రద్ధను కట్టుదిట్టం చేస్తుంది. అంటే మాల ఎప్పుడూ మెడలోనే ఉంటే సామాన్యులకు నిత్యకృత్యాలలో దానిపట్ల అతి పరిచయం వలన శ్రద్ధ మందగించి అంత మేరకు జపంలో అంతగా ఉపకరించ లేకపోతుంది. కనుక జీవితాన్నంతటినీ అనుక్షణమూ భగవత్స్మరణలో గడపను అంకితం చేసుకున్న మహనీయులకు, దేవతలకు మెడలో తులసిమాల, రుద్రాక్షమాల వంటివి సమ్మతించబడ్డాయి.

తీవ్రయోగాభ్యాసంలో ఒక విషయం అనుభవ గోచరమవుతుంది. ఎవరు ఏ భావంతో ఏ వస్తువును చూడడం, స్పృశించడం చేస్తారో వారి భావాల ప్రభావం సూక్ష్మంగా ఆ వస్తువులకు సోకుతుంది. ఉదాహరణకు తీవ్ర సాధనాకాలంలో మొహమాటానికో, చాపల్యానికో పోయి, ఎవరైనా యిచ్చిన వస్తువులు స్వీకరిస్తే, అంతవరకూ ఆ సాధకుడికెన్నడూ సహజంగా రానివి, ఆ వస్తువును సమర్పించిన వ్యక్తికి సహజమూ అయిన భావాలు కల్గుతాయి. అందువలన భగవద్యానంలో వుండను వీలులేకుండా ప్రాపంచిక జీవితాన్ని గడిపే స్థితిలో నున్న మనలో సంస్కారంబలం వలన ఎన్నో ద్వంద్వ భావాలు కల్గుతాయి. మనస్సు కొన్నివేల యోచనలు చేస్తుంది. భావాలను పొందుతుంది. ఇన్నీకలసి 'నిరంతరం నిశ్చలమైన భగవత్ స్మృతిలో వుండక పోవడం' అన్న సంస్కారంగా మన మెడలోని మాలను ప్రభావితం చేస్తాయి. కనుక రోజులో ఎక్కువకాలం ఈ వైఖరిని సంతరించుకున్న మాలలో స్వల్పకాలం మాత్రమే మనం సాగించే జపప్రభావం బలహీనమవుతుంది. కనుక జపమాలను మెడలో వేసుకోవద్దన్నారు. శరీర ధాతువుల మీద తులసికుండే మంచి ప్రభావాన్నను సరించి వేరొకమాల నెప్పుడూ మెడలో ధరించమన్నారు పెద్దలు.

నిరంతర భగవత్స్మరణ కుదిరాక మాల ఆవశ్యకత వుండదు.

మిగతా 11వ పేజీలో

(ఏప్రిల్ 2014 సాయిబాబా మాసపత్రిక నుండి)

ఆచార్యుని అద్భుత బోధలు

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతో గొప్ప ఆధ్యాత్మిక విషయాలు మాత్రమే కాక, నిత్యజీవితంలో మనకు అనుక్షణమూ సంభవించే సంఘటనలపట్ల, మన చర్యలు, ఆలోచనలు ఎలా వుండాలో చక్కగా వివరించి చెప్పేవారు. అట్టి ఆలోచనా పద్ధతిని వివరించి చెప్పే దక్షత ఎవరిలోనూ సాధారణంగా కనిపించదు. అదే ఆయనలోని మరొక మహోన్నతమైన, విశిష్టమైన దివ్యగుణం.

ఒకసారి ఒకరు పూజ్యశ్రీ మాస్టరుగారితో “నేను సరిగ్గా సేవ చేసుకోలేకపోతున్నాను. మాకు చక్కగా సేవ చేసుకోవడం చేతకావటంలేదు. మిగతా వారంతా ఎంతో బాగా చేసుకోగలుగుతున్నారు” అని బాధపడితే ఆయన ఇలా చెప్పారు:

“అసలు ఏదైనా పని చేతకావడం, చేతకాకపోవడం అన్నది ప్రశ్న కాదు. భగవంతుని దృష్టిలో సేవ చేసుకోవాలనే తపన, ఆరాటము, ఇంకా బాగా చేయాలనే ప్రయత్నము మాత్రమే సరియైనవి. మిగతావన్నీ పిల్లల బొమ్మలాటల క్రిందే లెక్క. ఉదాహరణకు భగవంతుడిని చక్కగా అలంకరణ చేసి చూసుకోవాలని ఒకరికి అనిపించవచ్చు. కానీ అతనికి అందంగా, ఆకర్షణీయంగా అలంకరించడం చేతగాక పోవచ్చు. మరొకరు ఎంతో అందంగా అలంకరించవచ్చు. కానీ అతనిలో ఎంతో అందంగా తన అలంకరణ ఇతరులకు కనిపించాలన్న భావం వుండివుండవచ్చు. తానెంతో బాగా అలంకరించానని అందరూ మెచ్చుకోవాలని అతనికి ఉందనుకుందాం. అప్పుడు అతను చేసిన పని ఎటువంటిది? ఎవరి మెప్పుకోసం అతడు చేసినట్లు? భగవంతుడిని చక్కగా అలంకరించి చూసుకొని ఆనందించేందుకు చేయవలసిన పనిని ఇతరుల మెప్పుకోసం మాత్రమే చేస్తున్నాడన్నమాట. అప్పుడేమౌతుంది? ఒకవేళ ఎవరో ఒకరు అతని అలంకరణను మెచ్చుకోకపోతే వారిమీద కోపం వస్తుంది, ద్వేషం వస్తుంది. అప్పుడతనికి తాను కూడా అవతలివారిని మెచ్చుకోకుండా విమర్శించాలనిపిస్తుంది. వారు చేసిన పనులను గురించి ఇతరులతో చెడుగా చెప్పాలనిపిస్తుంది. ఇలా చిలువలు పలువలుగా చెడు భావాలు ప్రకోపించి అతని కాలాన్ని, మనస్సును హరిస్తాయి. అంతేకాక ఇతరుల మనస్సులలో కూడా చెడు భావాలకు బీజాలు వేసినవాడవుతాడు. దీనికంతటికీ కారణమేమిటి? భగవంతుని పట్ల ఎటువంటి భావం పెట్టుకోవాలో తెలియకపోవడమే.

భగవంతుని దగ్గరకుగాని, మహాత్ముల దగ్గరకుగానీ ఎందరో భక్తి భావంతోనే వస్తారు. ఎంతో భక్తితో సేవ చేసుకోవాలనుకుంటారు. కానీ సరియైన భక్తి ఏమిటో, దానిని ఎలా పెంపొందించుకోవాలో చాలామందికి తెలియదు. అందుకే తాము ఎంతో భక్తితో సేవ చేస్తున్నామని అనుకుంటారు. అక్కడే వారు దెబ్బతింటూ వుంటారు. భగవంతుని దృష్టిలో తనపై వారికున్న సరియైన భక్తిభావం మాత్రమే ప్రధానముగానీ ఇతరములేవీ ఆయనకు పట్టవు.

ఉదాహరణకు ఒకరు వంట ఎంతో రుచిగా చేస్తామన్న అహంభావంతో చాలా అద్భుతమైన, రుచికరమైన వంటకాలను బాబా తప్పక స్వీకరిస్తారన్న ఆలోచనతో బాబాకు నైవేద్యం తీసుకువచ్చారనుకుందాము. మరొకరు బాబాకు నైవేద్యం పెట్టాలి అన్న ఆరాటం, తపనతో బాబాను స్మరిస్తూ

ఆయన తనచేత సరిగా సేవ చేయించుకోవాలని ప్రార్థిస్తూ చేతనైనమేరకు వంట చేసి బాబాకు నైవేద్యం తీసుకుని వచ్చారనుకుందాం. రెండింటిలో బాబా స్వీకరించేది మాత్రం రెండవవారిదేనని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే తనదెంతో ప్రతిభావంతంగా వుంటుందని భావించి ఇచ్చేవేవీ భగవంతునికి ప్రీతికరమైనవి కావు. ఎంతోమంది ధనికులు తెచ్చిన ఎంతో ఖరీదైన నైవేద్యాలు గాక ఒక ముసలి పేదరాలు తెచ్చిన చద్ది జొన్నరొట్టెను ఆయన స్వీకరించారు. ఇలాగే ఎంతోమంది మహాత్ముల జీవిత చరిత్రలలో వారు భక్తుల భావాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టంగా తెలుస్తుంది.

కనుక ఎలా చేసామన్నది ప్రాధాన్యం కాదు, ఏ భావంతో చేసామన్నది అతి ముఖ్యమైనది. అంతదాకా ఎందుకు? మనకు ఒకరు ఇష్టం లేకుండా ఏదైనా ఇచ్చినా, ఏదైనా తినడానికి పెట్టినా మనకు ప్రీతిగా వుంటుందా? ఎంతో ఇష్టంగా మనకు ఏవైనా, ఎవరైనా ఇస్తే మన మనస్సులో వున్న సంతోషం, ఇష్టం లేకుండా ఇచ్చినవారిపట్లగాని, ఆ వస్తువు తీసుకోవడంలోగానీ మనకు వుంటుందా? మనమూ అయిష్టంగానే, మొహమాటంగానే తీసుకొంటాం. హృదయపూర్వకంగా తీసుకోలేము. అలాగే భగవంతుడు కూడా. అందుకని భగవంతునిపట్ల ప్రేమ భావాన్ని పెంపొందించుకుంటూ, ఆయన పట్ల కృతజ్ఞతగా ఇంకా ఇంకా సేవచేసుకోవాలన్న భావాన్ని పెంపొందించుకుంటూ శక్తివంచన లేకుండా చేసే ఎటువంటి సేవ అయినా ఆయనకు ప్రీతికరమే.

ఎంతో బాగా సేవ చేసుకోవాలని అనుకోవడంలో తప్పులేదు. కానీ చేసుకోలేకపోతున్నామనే బాధ మరీ ఎక్కువ కాకూడదు. ఇలా బాధపడడం వల్ల సేవచేసుకునే దానికంటే బాధపడడమే ఎక్కువగా తయారవుతుంది. అందుకని సాధ్యమైనంతమేరకు శక్తివంచన లేకుండా ఎంతోబాగా చేసుకోవాలన్న తపనతో సేవ చేసుకుంటూ పోతే చాలు. అదే మనం చేయవలసినది. అప్పుడు ఆయన అనుగ్రహం తప్పక లభిస్తుంది".

~ __________ ~

ఒకసారి ఒకతను పూజ్యశ్రీ మాస్టరుగారికి ఎవరిగురించో చెబుతూ, "ఇలాంటి పనికిరాని వాళ్ళందరినీ ఏమి చేయాలి సార్?" అని అడిగాడు.

అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఇలా చెప్పారు:



"పనికిరాని వాడంటూ ఎవరూ వుండరు. అసలు ఈ ప్రపంచంలో పనికిరానిదంటూ ఏమీ లేదు. అన్నీ ఏదో ఒకదానికి పనికి వస్తూనే వుంటాయి. ఈ సృష్టిలో అన్నీ ఒకదానికొకటి ఉపయోగపడుతూనే, అంటే పనికివస్తూనే, సహజీవనం సాగిస్తుంటాయి. ఒక్క మనిషి మాత్రమే 'వీడు పనికిరాడు', 'ఇవి పనికిరావు' అనుకుంటూ తన మనస్సును పనికిరాని విధంగా తయారు చేసుకుంటున్నాడు. అసలు పనికిరాకపోవడమంటే ఏమిటి? నీకది ఉపయోగపడనంత మాత్రాన ఏదైనా పనికిరానిదెందుకవుతుంది? నీకు పనికిరానిది ఇంకొకరికి పనికిరావచ్చు కదా?

సాటి మనిషిని 'పనికిమాలినవాడా!" అని తిట్టినా కూడా పాపమొస్తుందని పెద్దలు చెప్పారు కదా! వారు చెప్పిన దానిలో ఎంతో అర్థముంది. ఒకనికి పనికిరానివాడిగా కనిపించినవాడు మరొకరికి ఎంతో మంచివాడిగా కనిపించవచ్చు. అప్పుడు ఎవరి అభిప్రాయం సరిగ్గా వుందని భావించాలి? మన యొక్క స్వభావాన్ని బట్టి, సంస్కారాన్ని

బట్టి కొందరు మనకు మంచివారుగాను, మరికొందరు చెడ్డవారుగానూ కనిపిస్తారు. ఒకరు మరొక మంచి వ్యక్తిని చెడుగా దూషించడము, ఒక చెడ్డవ్యక్తితో మంచిగా స్నేహం చేయడమూ లోకములో చూస్తూనే వున్నాము. అంతెందుకు, లోకాన్ని ఉద్ధరించడానికి అవతరించిన అవతార పురుషులను, మహాత్ములను సైతం దూషించేవారు ఎందరో వుంటారు. శ్రీరాముడిని, శ్రీకృష్ణుడిని కూడా దూషించేవారు, విమర్శించేవారూ ఈనాటికీ వున్నారు. వారిని భక్తితో సేవించేవారూ వున్నారు. అయితే దూషించేవారి వైపు నుంచీ, వారి మనస్తత్వంలోంచి చూస్తే వారికి ఈ అవతారపురుషులు ఎంత చెడ్డగానో కనిపిస్తారు. వారు ఎప్పటికీ తమ అభిప్రాయాలను మార్చుకోకపోవచ్చు. అది అలా కొనసాగుతూనే వున్నది.

అయితే బాబాగానీ, పెద్దలుగానీ ఇతరులను చెడుగా తలచవద్దని ఎందుకు చెప్పారు? దానిలోని అంతరార్థమేమిటి?

అలా వారు చెప్పడానికి కారణం – అవతలివారు చెడ్డవారా, మంచివారా అన్నది ప్రశ్నకాదు. అవతలివారిని మనం చెడుగా భావించడం వల్ల కలిగే నష్టం గురించి మాత్రమే. ఇతరులను చెడుగా అనుకోవడం వల్ల మనకు వచ్చే నష్టమేమిటి? అన్నది ప్రశ్న.

ఇతరులను చెడుగా మనం తలచినప్పుడు మన మనస్సు ఆ చెడు గుణాలను స్మరిస్తుంది. అంతటితో మాత్రమే ఆగక ఆ చెడ్డగుణాలు గల వ్యక్తి గురించి ఇతరులతో చెప్పడం జరుగుతుంది. దానితో అవతలివాడి మనస్సు కూడా చెడుభావాలతో నిండిపోతుంది. ఇంతకూ మనము అవతలివాడి గురించి చెడుగా తలచినంత మాత్రాన, వాడిని దూషించినంత మాత్రాన వాడు మారుతాడని నమ్మకమేమిటి? అసలు మనమనుకున్నట్లు వాడెందుకుండాలి? వాడి ఇష్టప్రకారము వాడు ఆలోచిస్తాడు.

ఇంతకూ మనము సరియైన విధముగా ప్రవర్తిస్తున్నామని నమ్మకమేమిటి? మనమే చెడ్డవాళ్ళము, అవతలివాడు మంచివాడుగా వుండి వుండవచ్చు కదా?! అటువైపు నుంచీ ఆలోచిస్తే అవతలివాడు మనలాగా చెడ్డగా మారాలా? మరొక విధంగా చూస్తే వాడూ మనలాగా ఇతరులను చెడుగా భావిస్తూ, విమర్శిస్తూ, ఇతరులతో చెప్పుకుంటూ కాలాన్ని గడపాలా? అప్పుడు ఏమౌతుంది? ఇతరులను విమర్శించే ఒక సంఘము ఏర్పడుతుంది. అందరూ తామే సరైన వాళ్ళమని, అవతలివారు చెడ్డవారనీ తలుస్తూ తాము గొప్పవారమనే అహంభావాన్ని ఆ సంఘంలోని వారు పెంచుకుంటూ పోవటము జరుగుతుంది. దానివల్ల వచ్చే లాభమేమిటి?

దీనికంతటికీ కారణం – మనం చాలా మంచివారమనీ, మనలో ఎట్టి చెడ్డగుణాలూ లేవనీ మనపట్ల మనకు దృఢవిశ్వాసము వుండడమే. మనము మంచివారము అవునో కాదో మనకు ఎలా తెలుస్తుంది? మనలను విమర్శించేవారి దృష్టిలో మనమూ చెడ్డవారమేగా?

ఇలా ఆలోచిస్తే ఎవ్వరూ అందరి దృష్టిలో మంచివారూ కాదు, చెడ్డవారూ కాదు. నిజముగా కూడా ప్రతివారిలోనూ కొన్ని సుగుణాలు, కొన్ని బలహీనతలు కలిసిమెలసే వుంటాయి. ఈ సత్యాన్ని గుర్తించి అవతలివాడిలోనూ, మనలోనూ కూడా కొన్ని బలహీనతలుంటాయని గుర్తించి అవతలివాడి పట్ల సుహృద్భావంతో మెలగడం నేర్చుకోవాలి. అప్పుడు మన దృష్టిలో పనికిరానివారంటూ మనకు ఎవరూ కనిపించరు. అవతలివారిని పనికిమాలినవాడు అని విమర్శించే పనికిమాలినతనం మనలో పోతుంది. అప్పుడు మన మనస్సు మంచి వాటిని గురించి ఆలోచిస్తుంది.

ఇందులో ఒక ధర్మసూక్ష్మం కూడా ఇమిడివుంది. మనం ఎవరినైనా విమర్శిస్తే వారు చేసిన పాపం మనకు, మనం చేసిన పుణ్యం వారికి సంక్రమిస్తుందని బాబా చెప్పివున్నారు కదా! అంటే మనం పుణ్యకార్యాలు చేసి కూడబెట్టుకున్న పుణ్యాన్ని ఉచితంగా అవతలివారికి ధారాదత్తం చేస్తున్నామన్నమాట! అంతవరకూ అయినా ఫరవాలేదు. కానీ వాడు చేసిన దుష్కర్మ ఫలితాలను, పాపాన్ని మనం కొనితెచ్చుకుంటున్నాం అన్నమాట. అందువలన మన పుణ్యం ఖర్చయిపోవడమే గాక, అవతలివాడు చేసిన పాపకర్మను అనుభవించవలసి వస్తుంది. అందువల్ల నష్టపోయేది ఎవరు? మనమేకదా! అంతేకాక, మనం అవతలివారి గురించి చెడ్డబోధలు ఎవరికైతే చెబుతామో వారి మనసులను కూడా ప్రభావితం చేసి వారు కూడా అవతలివారిని దూషించేటట్లు చేస్తాయి. ఆ కారణంగా వారు కూడా అవతలివాడు చేసిన పాపంలో భాగం పంచుకుంటారు. దీనికంతటికీ కారణం మన విమర్శలే గనుక మనకు వీళ్ళు (మనం చెప్పగా విమర్శించే వాళ్ళు) చేసిన అట్టి

మిగతా 19వ పేజీలో

మాతృదేవి స్మృతులు

శ్రీ శ్రీధర్, చెన్నై

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి లీలా వైభవాన్ని చెన్నైలో వుంటున్న శ్రీధర్ గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు—

2009వ సంవత్సరంలో పూజ్యశ్రీ అమ్మగారు నాకు స్వప్నదర్శనమిచ్చారు. ఆ స్వప్నంలో నిలయంలో భక్తజనులందరి మధ్యలో పూజ్యశ్రీ అమ్మగారు కొలువై వున్నారు. అందులో నేను కూడా వున్నాను. ఇంతలో పూజ్యశ్రీ మాస్టరుగారి పూర్వవిద్యార్థి ఒకతను వచ్చాడు. అతను పూజ్యశ్రీ అమ్మగారితో, "అమ్మగారూ! నా భార్య పారాయణలు చేయదు, నేను చెప్పినట్లు వినదు, అందంగా వుండదు..." అని తన భార్య గురించి విమర్శగా చెప్తున్నాడు. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు తీవ్రమైన స్వరంలో, "అన్ని సంవత్సరాలు పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిలో వుండి, వారి సత్సంగాలు వింటూ కూడా ఈవిధంగా మాట్లాడుతున్నావంటే నాకు చాలా బాధగాను, ఆశ్చర్యంగానూ వుంది! ముందు నువ్వు నీ భార్య చెప్పినట్లు చెయ్యి!" అని కోపంగా అన్నారు. అక్కడే వుండి ఈమాటలు వింటున్న నాకు అవి తూటాలలాగా తగులుతున్నాయి. ఎందుకంటే అటువంటి పనికిమాలిన భావాలన్నీ నాలో వున్నాయి. నాకు చెప్పకనే బుద్ధిచెబుతున్న పూజ్యశ్రీ అమ్మగారి సర్వజ్ఞత్వానికి ఆశ్చర్యపోతూ ఇటువంటి భావాలు నాలో తొలిగించమని మనసులో వేడుకుంటూ ప్రార్థన చేశాను. ఆ స్వప్నం ముగిసింది. ఈ విధంగా కలలో నాకు బుద్ధి చెప్పడము, నేను హృదయపూర్వకంగా ప్రార్థన చేసుకోవడమూ జరిగాక నాలో అటువంటి భావాలు నెమ్మదిగా తగ్గుముఖం పట్టడం నేను గమనించాను! పూజ్యశ్రీ అమ్మగారికి చేసిన ప్రార్థన ఏది వృధాగా పోదు అనడానికి నేనే నిదర్శనం !

ఒకసారి స్వప్నంలో పూజ్యశ్రీ అమ్మగారిని నాకు మంచి జాబ్ రావాలని అడిగాను. దానికి పూజ్యశ్రీ అమ్మగారు శ్రీ సాయి లీలామృతం పారాయణ చేయమన్నారు. నేను సరేనని అనకుండా శ్రీగురుచరిత్ర పారాయణ చేస్తానని చెప్పాను! కాదు, శ్రీ సాయి లీలామృతమే పారాయణ చేయమన్నారు. ఇలా కొంతసేపు జరిగాక, "నువ్వు ఒంగోలుకు రా!" అని చెప్పారు. అంతటితో స్వప్నం ముగిసింది. కొన్నాళ్ళకి నిజంగానే పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి ఒంగోలు వెళ్లాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారిని నా జాబ్ గురించి అడిగాను. కలలో ఎలా చెప్పారో అలాగే శ్రీ సాయి లీలామృతం పారాయణ చెయ్యమన్నారు. నేను, "శ్రీగురుచరిత్ర పారాయణ చేయవచ్చా?" అని అడిగాను. కాదు, శ్రీ సాయి లీలామృతమే పారాయణ చెయ్యమన్నారు! కలలో జరిగిన సంభాషణే ఇలలో కూడా ఏమాత్రం తేడా లేకుండా జరిగింది!! ఇక ఆశ్చర్యపోవడం నా వంతైంది!

ఇంకొకసారి స్వప్నంలో నేను, మా స్నేహితుడు కలిసి పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్ళాము. అక్కడ ఫంక్షన్ జరుగుతోంది. పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహానికి అభిషేకం చేస్తున్నారు. ఆరోజు మా స్నేహితుడి పుట్టినరోజు. మేమిద్దరమూ పూజ్యశ్రీ అమ్మగారికి పాదాభివందనం చేసి కూర్చున్నాము. పూజ్యశ్రీ అమ్మగారు నా స్నేహితుడితో, "ఈరోజు నీ పుట్టినరోజు కదా, మీ స్నేహితులతో సరదాగా

గడిపేవాడివేమో! ఇక్కడకి రావడంవల్ల అది మిస్ అయినట్లున్నావు కదా!?" అన్నారు. దానికి మా ఫ్రెండ్, "అలా ఏమీ లేదు అమ్మగారూ! మీదగ్గర వుండటమే నాకు పెద్ద గిఫ్ట్!" అన్నాడు. వాళ్లిద్దరూ అలా మాట్లాడుకుంటున్నారు. పూజ్యశ్రీ అమ్మగారు నావైపు చూడలేదు. నాతో మాట్లాడలేదు. నాకు అర్థం అవుతోంది అమ్మగారు నన్ను పట్టించుకోవడం లేదని! నాకు చాలా బాధ కలిగి పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహం దగ్గరకి వెళ్లి ప్రార్థన చేశాను. అప్పుడు నేను చూస్తుండగానే పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహంలో కదలికలు ఏర్పడ్డాయి. పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహం సజీవంగా మారిపోయింది. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారితో నా బాధ వెల్లడించుకున్నాను. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు, "నీలో ఏమైనా నెగెటివ్ థాట్స్ వున్నాయేమో చూసుకో!" అన్నారు. స్వప్నం ముగిసింది. అప్పటినించి ప్రతిరోజూ పూజ్యశ్రీ అమ్మగారి పటం దగ్గర క్షమాపణలు చెప్పుకుంటూ నా ఆలోచనలను సరిచేయమని ప్రార్థన చేస్తున్నాను. కొన్నిరోజులకి పూజ్యశ్రీ అమ్మగారు స్వప్నదర్శనమిచ్చి నాతో చాలాసేపు మాట్లాడారు

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నంలో, "ఏం శ్రీధర్, బాగున్నావా?" అని పలకరించారు. "నేను బాగున్నాను మాస్టరుగారూ!" అని చెప్పి వారి పాదాలకు నమస్కరించి వారి పక్కనే కూర్చున్నాను. అప్పుడు కొంతమంది భక్తులు వచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారికి తెల్లకాగితాలు ఇచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారు నావైపు చూసి, "వీళ్ళకి ఏమీ పనిలేదు, ఎప్పుడూ ముగ్గులు వేయమంటారు!" అన్నారు. మరి కొంతమందికి ఏదో వ్రాసి ఇస్తున్నారు. నేను కూడా పూజ్యశ్రీ మాస్టరుగారికి ఒక పేపర్ ఇచ్చాను. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ పేపర్లో "మనం తీర్చాల్సిన అప్పులు తీర్చివేయాలి. ఇట్లు, మహాలక్ష్మి" అని వ్రాసారు. స్వప్నం ముగిసింది. నిజానికి నాకు అప్పులేమి లేవుకాని కొన్ని ఋణానుబంధాలతో సమస్యలున్నాయి. వాటిని నెరవేర్చితీరాలి అని చెప్పినట్లు అనిపించింది.అదేభావనతోమనసులో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్ళినప్పుడు ఈ స్వప్నంగురించి అడిగితే, "నీకు ఏమైనా అప్పులు వుంటే వెంటనే తీర్చేయి!" అన్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారి సందేశం ఇంకొకసారి నిర్ధారించబడింది అనిపించింది.

ఈ విధంగా ఎన్నో సందర్భాలలో నన్ను ఆదుకుంటూ నాకు మార్గదర్శకత్వం చూపిస్తున్న గురుదంపతులకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను? సహస్ర వందనాలు అర్పించడం తప్ప!! ●

పరిప్రశ్న

06వ పేజీ తరువాయి

మిగిలిన వారి కాదర్శంగా మాత్రమే, అంటే అలాటి అభ్యాసం తనకెట్టి కృతార్థత నిచ్చిందో సాటివారు గుర్తించి ఉపయోగించుకొనేందుకు మాత్రమే మాలను ధరించవచ్చు. లేక సాత్విక స్వభావానికి సాత్విక పదార్థాలు మీద ప్రీతియున్నట్లే ఉత్తమ సాధకులకు తులసి ప్రీతినివ్వడం వలన గూడ వారు దానిని ధరించ వచ్చు.

మంచి మాలలు మధురా బృందావనంలోని మఠాలలో దొరుకుతాయి. దివ్యజీవన సంఘము, వ్యాసాశ్రమము (ఏర్పేడు), రామ నామ క్షేత్రము (గుంటూరు) మొదలైన వారివద్ద మంచివి దొరుకుతాయి. ఇటీవల మరికొన్ని ఆధ్యాత్మిక సంస్థలు చాలా ఎక్కువ వెలకు అమ్ముతున్నారు గూడ. నా మిత్రులకు గుంటూరులోని రామనామక్షేత్రంలో చాలా సరసమైన ధరలకు మంచిమాలలు దొరికాయి.

వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

పదవ ప్రసంగము

లోక సంగ్రహమంటే, ఎవరికి భగవంతుడి కటాక్షం కలుగుతుందో వారు ఎటువంటి ఫలితాన్ని అపేక్షించకుండా జన కళ్యాణం కోసం నిష్కామకర్మను ఆచరించి ఆదర్శ పురుషులు కావాలి. ప్రజలు కూడా ఆదర్శ పురుషులను అనుసరించి కర్మలు ఆచరించి అభ్యుదయాన్ని పొందుతారు.

మహాభారతంలో యిలా చెప్పబడి వున్నది:

శ్లో॥ లోక సంగ్రహ సంయుక్తం
విధాత్రా విహితం పురా I
సూక్ష్మధర్మార్థ నియతం
సతాం చరితముత్తమమ్ II

భావం : లోకసంగ్రహం కోసం కర్మలను ఆచరించేవాడు, ధర్మార్థాల సూక్ష్మత్వాన్ని ఎరిగినవాడు సత్పురుషుడు. అతని చరిత్రను బ్రహ్మదేవుడే వ్రాస్తాడు.

కర్మ సన్యాసయుక్తమైన కర్మయోగము శ్రేష్ఠమైనది

కర్మయోగము, సన్యాసము రెండు వరుసగా మోక్షాన్నిస్తాయి. కానీ ఈ రెండింటిలోనూ కర్మ యొక్క త్యాగముతో కూడిన కర్మయోగము ఉత్తమమైనది. ఈ కర్మయోగంలో లోకసంగ్రహము మొదలైన గుణాలు ఎక్కువగా వున్నాయి. వీటికి నిష్కామకర్మ అవసరము. శ్రీకృష్ణుడు భగవద్గీత 18 వ అధ్యాయంలో ఇలా చెప్పాడు:

శ్లో॥ యజ్ఞదానతపః కర్మ
నత్యాజ్యం కార్యమేవ తత్ I
యజ్ఞోదానం తపశ్చైవ
పావనాని మనీషిణామ్ II

భావం : యజ్ఞము, దానము, తపస్సు అనే కర్మలను విడవకూడదు. ఆచరించాలి. ఎందుకంటే అవి మానవులను పవిత్రులను చేస్తాయి.

కర్మ భేదాలు

పై శ్లోకంలో యజ్ఞ దాన తపోరూపమైన కర్మ

మానవుని కర్తవ్యం అని చెప్పబడింది. యజ్ఞాలు కర్మయజ్ఞాలు, ఉపాసనా యజ్ఞాలు, జ్ఞాన యజ్ఞాలు అని మూడు రకాలు. వాటిలో కర్మలు - విహిత కర్మలు, అవిహిత కర్మలు అని రెండు విధాలు. విహిత కర్మలలో ముఖ్యమైనవి కామ్యములు, నిత్యములు, నైమిత్తికములు, ప్రాయశ్చిత్తములు అని నాలుగు రకాలు. కొంతమంది సత్పురుషులు ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక మనబడే మూడు రకాలైన కర్మలను కూడా చెబుతారు. విహితకర్మలైన ఈ ఏడు రకాలైన కర్మలు కర్మయోగంగా సత్పురుషులు పరిగణిస్తారు.

సంధ్యావందనము మొదలైనవి నిత్యకర్మలు. పుత్రోత్పత్తి (సంతాన సంబంధిత) సంబంధితాలైన జాతకర్మ మొదలైనవి నైమిత్తిక కర్మలు. ప్రాయశ్చిత్తకర్మలు పాపాన్ని పోగొట్టడానికి చేయబడతాయి. పాపాలు జ్ఞాతములు, అజ్ఞాతములు అని రెండు రకాలు. జ్ఞాతపాపములు అంటే ఈ జన్మలో చేసినవి, జ్ఞాపకం వున్నవి. అజ్ఞాత పాపములు అంటే ఈ జన్మలోను, పూర్వజన్మలలోను చేసినవి, మరచిపోయినవి. ఈ రెండు రకాలైన పాపాలను పోగొట్టడానికి చేసే ప్రాయశ్చిత్తం అసాధారణ, సాధారణ భేదాల వలన రెండు రకాలు. అసాధారణ ప్రాయశ్చిత్తానికి పాపాన్ని పోగొట్టుకోవడానికి ధర్మశాస్త్రంలో విశేష కర్మ ఆచరించడానికి విధించబడింది. సాధారణ ప్రాయశ్చిత్త కర్మలు జ్ఞాతాజ్ఞాత పాపాలను (జ్ఞాత, అజ్ఞాత) పాపాలను పోగొడతాయి. చాంద్రాయణాది వ్రతాలు, గంగాస్నానము, భగవన్నామస్మరణ మొదలైనవి.

ప్రపంచంలోని పదార్థాలను పొందడానికి చేయబడే కర్మలు కామ్యకర్మలు. బాధపడే వాడికి, దీనునికి ఉపకారం చేయడం ఆధ్యాత్మకర్మ. ఇంద్రుడు మొదలైన దేవతల సంతృప్తి కోసం చేసే కర్మ ఆధిదైవిక కర్మ. బ్రాహ్మణ భోజనము, గోసేవ మొదలైనవి ఆధిభౌతిక కర్మలు.

ఉపాసనా భేదాలు, ఉపాసనా సాధన పద్ధతి, ఉపాసనా పద్ధతి - వీటి గురించిన వివరాలు ఎన్నో గ్రంథాలలో వున్నాయి.

మంత్రయోగము, హఠయోగము, లయయోగము, రాజయోగము అని నాలుగు రకాల సాధన పద్ధతులు చెప్పబడ్డాయి. ఉపాసనా పద్ధతిని అనుసరించి సగుణబ్రహ్మోపాసన, నిర్గుణబ్రహ్మోపాసన, దేవాది ఉపాసన, ఋష్యాది ఉపాసన, మూర్త్యుపాసన అని ఐదుభేదాలు.

జ్ఞానయజ్ఞము - శ్రవణము, మననము, నిధిధ్యాసనము అని మూడు రకాలు. ఇలాగే కర్మయజ్ఞానికి సాత్త్వికాది భేదాల చేత తొమ్మిది రకాలు. ఇలా 54 యజ్ఞ భేదాలను శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు. వీటిలో ముముక్షువు తామస రాజస కర్మలను వదిలి సాత్త్వికములైన కర్మ, ఉపాసనా, జ్ఞానయజ్ఞాలను అభ్యసించాలి.

నిష్కామ కర్మను, ఉపాసనను ఒకే సమయంలో ఆచరించాలి

వేదంలో యిలా చెప్పబడివుంది:

శ్లో॥ విద్యాం చావిద్యాం చ
యస్తద్వేదోభయం సహ l
అవిద్యయామృత్యుం
తీర్త్వా విద్యయాఽమృత మశ్నుతే ll

భావం: నిష్కామకర్మ, ఉపాసన - ఈ రెండింటి స్వరూపాన్ని తెలుసుకుని, ఎవడు ఒకేసారి రెండింటిని ఆచరిస్తాడో అతడు నిష్కామకర్మచేత మృత్యువును జయించి ఉపాసన ద్వారా ఇష్టదేవతను పొందడం ద్వారా సాపేక్షిక మోక్షాన్ని పొందుతాడు. కాలనియమం కలది సాపేక్షిక మోక్షము. పరమాత్మ ప్రాప్తి అనే మోక్షము కాలముతో సంబంధించినది కాదు. కేవలము కర్మ కాని, కేవలము ఉపాసనగాని ఆచరించేవాడికి అనిష్టము కలుగుతుందని వేదము ఘోషిస్తున్నది.

శ్లో॥ అన్ధం తమః ప్రవిశన్తి
యేఽవిద్యాముపాసతే l
తతో భూయ ఇవ తే
తమో య ఉ విద్యాయాం రతాః॥

భావం : కర్మ రూపమైన అవిద్యను మాత్రమే ఉపాసించేవారు, అంటే కర్మలను మాత్రమే చేసేవారు గొప్ప అజ్ఞానాన్ని పొందుతారు. కర్మను విడచి ఉపాసన మాత్రమే చేసేవారు కర్మ చేసేవారి కంటే ఎక్కువ అజ్ఞానాన్ని పొందుతారు. కాబట్టి కర్మ, ఉపాసన - రెండు ఒకేసారి ఆచరించాలని శృతి ఉద్దేశము.

- సశేషం

(గత సంచిక తరువాయి)

శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

ఒకరోజు వీరేంద్ర దాదా అనే భక్తుడు అమ్మను యిలా ప్రశ్నించాడు: "అమ్మా! ప్రతిరోజూ మీ దగ్గరకు ఎందరో భక్తులు వస్తుంటారు. చాలా మంది కొత్తవారు కూడా వస్తుంటారు. వీరందరినీ చూస్తుంటే మీకు ఏమి అనిపిస్తుందమ్మా?" అమ్మ యిలా అన్నారు: "ఇందులో కొత్తవారు ఎవరున్నారు? కొత్తవాళ్ళంటూ ఒక్కరు కూడా లేరు. అందరూ అతి పరిచితుల వలె అనిపిస్తారు!"

వీరేంద్ర దాదా మళ్లీ యిలా అడిగాడు: "అమ్మా! ఇక్కడ కూర్చుని వున్న భక్తుల మనసులలో మెదిలే భావాలన్నీ మీకు తెలుస్తుంటాయా? సమాధానంగా అమ్మ, "అలా ఏమీ లేదు. అందరి మనసులలోని ఆలోచనలు నాకు తెలుస్తుంటాయని లేదు. నా దృష్టి ఎప్పుడూ ఎటువైపు ప్రసరిస్తుందో అప్పుడు మాత్రమే తెలుసుకొనటం జరుగుతుంది. అక్షరమాల లోని అక్షరాలన్నీ మీకు తెలిసినవే. అయినా అవన్నీ ఎప్పుడూ మీ మనసులలో వుండవు కదా! కాని, మీరు ఎప్పుడు ఏ అక్షరాలను గుర్తు తెచ్చుకుంటారో అప్పుడు ఆ అక్షరాలు మీ మనసులోకి వస్తాయి. ఈ విషయం కూడా అంతే. ఇది ఒక దృష్టికోణానికి సంబంధించిన విషయం. ఒక్కొక్కసారి అందరినీ చూస్తున్నప్పుడు కూడా, ఏ ఒక్కరి విషయమూ ఏమాత్రం దృష్టిలోకి రాదు. దృష్టి ఎప్పుడు ఎటువైపు మరలుతుందో చెప్పలేను" అన్నారు.

ఒకరోజు ఒక భక్తుడు అమ్మను యిలా ప్రశ్నించాడు: "అమ్మా! అవతార పురుషునికీ, సాధకునికీ గల తేడా ఏమిటి? సాధారణ ప్రజలు వారిని ఎలా గుర్తించగలరు?" అమ్మ కొంతసేపు మౌనం వహించారు. ఆ తర్వాత "అవతార పురుషులు సమయము, సందర్భము ఆసన్నమైన పరిస్థితిలో అప్రయత్నంగానే తమను గురించి తాము వెల్లడి పరచుకొనటం జరుగుతుంది. అలా జరుగకపోతే సామాన్య ప్రజలు వారిని గుర్తించే అవకాశమే వుండదు. సాధకులు తమ లక్ష్య సాధనకై నియమ బద్ధ జీవితం గడుపుతూ ఎంతో అప్రమత్తతతో సాధన కొనసాగిస్తుంటారు. అవతార పురుషులు ఎటువంటి నియమాలకూ బద్ధులుకారు. వారు సర్వ స్వతంత్రులు. అప్రయత్నంగా అతిసహజంగా, వారి అవతార కార్యకలాపాలు జరిగిపోతుంటాయి. బాగా వితర్కించి తెలుసుకొనగల సామర్థ్యం వున్న జిజ్ఞాసువులు అవతార పురుషునికి, సాధకునికి గల వ్యత్యాసాన్ని గుర్తించ గలుగుతారు. కానీ సాధారణ ప్రజలు మాత్రం గుర్తించటం చాలా కష్టం" అన్నారు అమ్మ.

శ్రీ ఆనందమయి మాత తనను శరణు వేడిన ఎందరో ఆపన్నులను కష్టాల బారినుండి కాపాడేవారు. రోగగ్రస్తులను తమ ఆశీస్సులతో రోగాల బారినుండి విముక్తులను చేసి, ప్రాణదానం చేసేవారు. ఒకసారి అతులదత్తు అనే భక్తుని భార్య అమ్మ వద్దకువచ్చి జబ్బుతో బాధపడుతున్న తన బిడ్డను ఆశీర్వదించమని, తమ యింటికి రమ్మని ఎంతగా ప్రాధేయపడినా అమ్మ పలుకలేదు. ఆమె

భోలానాథ్ గారితో మొరపెట్టుకుంది. "అంతగా ప్రార్థిస్తుంటే ఒక్కసారి వెళ్లిరావచ్చు కదా!" అన్నారాయన. "ఏమి లాభం? అతడెట్లాగూ బ్రతకడు" అన్నారు అమ్మ. అయినా భోలానాథ్ గారితో కలసి వెళ్ళివచ్చారు. "నా దృష్టిలో మరణించినా, జీవించినా ఒకటే! ఒక్కొక్కసారి మరణించబోయే వ్యక్తి వద్దకు వెళ్లడం కూడా అవసరమే" అన్నారు అమ్మ. "ఒకసారి ఒక వ్యక్తి తీవ్ర వ్యాధిగ్రస్తురాలై నడవలేని పరిస్థితిలో వున్న తన కుమార్తెను అమ్మ వద్దకు తెచ్చాడు. తన బిడ్డను కాపాడమని ఎంతగానో వేడుకొన్నాడు. ఆ సమయంలో అమ్మ వక్కలను పగలగొడుతున్నారు. ఒక వక్కను క్రింద కూర్చుని వున్న ఆ పాప వద్దకు విసిరేసి "దానిని తీసుకో" అన్నారు. అతికష్టంమీద ఆ అమ్మాయి ఆ వక్కను అందుకున్నది. ఆ మరుసటి రోజు నుండే ఆమె ఆరోగ్యవంతురాలై చక్కగా నడవటం జరిగింది.

శ్రీ ఆనందమయి అమ్మ ఎందరో రోగగ్రస్తులకు అభయమిచ్చి ఆశీర్వదించి రోగ విముక్తులను చేశారు. కొందరు రోగగ్రస్తులు అమ్మను ఆశ్రయించి తమ జబ్బు తగ్గించమని ప్రార్థించినప్పుడు అమ్మ ఏమీ మాట్లాడక మౌనం వహించేవారు. అమ్మను మరీ మరీ వేడుకున్నప్పుడు అమ్మవారికి ఏదైనా నియమం విధించి పాటించమనేవారు. వారు ఆ నియమాన్ని సరిగా పాటించలేకపోయేవారు. నియమ భంగం వాటిల్లడంతో దాని ఫలితాన్ని గురించి చెబుతూ అమ్మ, "జరగబోయేది జరగక మానదు. నేనెప్పుడూ చెబుతుంటాను ఏ విషయంలోనూ నన్ను బలవంత పెట్టవద్దు అని, దాని వల్ల ప్రయోజనం ఏమీ వుండదని. నావల్ల జరిగేదేమైనా వుంటే అటువంటి సందర్భాలలో ఏ ప్రమేయము లేకుండానే అప్రయత్నంగా అన్ని సవ్యంగా నెరవేరుతాయి" అని చెప్పేవారు. కొన్ని సంఘటనలను స్వయంగా చూసిన భక్తులు అమ్మను వ్యాధులు తగ్గించమని కోరికలు తీర్చమని ప్రార్థించినప్పటికీ ఒత్తిడి చేసేవారుకాదు. కొన్ని సందర్భాలలో అనారోగ్యం పాలైన వ్యక్తుల వద్దకు అమ్మ స్వయంగా వెళ్లి వారిని ఆశీర్వదించి వచ్చేవారు. వారు ఆరోగ్యవంతులయ్యేవారు.

ఒకరోజు ఆనందమయి అమ్మ ధానాకోడా జమీందారు గారింటికి బయలుదేరారు. అమ్మ ఎక్కిన కారు బయలుదేరిన సమయంలో ఒక గుఱ్ఱపు బండి నుండి ఒక భక్తుడు దిగాడు. అతడు ఎంతో దూరం నుండి అమ్మ దర్శనార్థం వచ్చాడు. అమ్మ కారులో వెళ్లిపోవడం చూచి మరల వెంటనే గుఱ్ఱపు బండి ఎక్కి అమ్మ కారును అనుసరించవలసినదిగా బండివాడిని తొందరగా పెట్టసాగాడు. ఎలాగైనా అమ్మను దర్శించి నమస్కరించుకోవాలని అతడి ఆరాటం. ఆ కంగారులో కారు వేగాన్ని ఒక గుఱ్ఱపు బండి అందుకొనగలదా లేదా అన్న ఆలోచన కూడా అతడికి రాలేదు. అతని తపన అమ్మను దర్శించాలన్నదే. కారులో ప్రయాణిస్తున్న అమ్మ వున్నట్లుండి కారును ఆపమన్నారు. అమ్మ కారుతో పాటు గుఱ్ఱపు బండి కూడా ఆగింది. కారు దిగిన అమ్మను గుఱ్ఱపు బండిలో వచ్చిన ఆ భక్తుడు తనివి తీరా దర్శించుకుని, అమ్మకు పాదాభివందనం చేసుకొని చరణధూళి స్వీకరించాడు. అతడు తన కోరిక అలా సఫలీకృతమవడంతో ఎంతో ఆనందించాడు. ఈ విషయం గురించి అమ్మ యిలా వివరించారు: "అతి వేగంగా నడిచే కారును ఒక గుఱ్ఱపు బండి అనుసరించటమే కాదు ఆశించిన లక్ష్యాన్ని అందుకోగలిగిందంటే అందుకు కారణం యేకాగ్రమైన మనస్సు. లక్ష్యంపై గురి, సాధించదలచిన విషయంపై పట్టుదల, ప్రీతి వున్నప్పుడు సర్వేంద్రియాలతో లక్ష్యంపై గురిపెట్టి సకల శక్తులు ఒడ్డి మనసును ఏకాగ్రపరిచి ముందుకు సాగటం జరుగుతుంది. ఆ తీవ్ర ప్రయత్నమే ఫలితాన్ని అందిస్తుంది. దేనిని సాధించాలన్నా 'ఏకాగ్రత' అన్నదే అతి ముఖ్యమైన అంశం". ఇలా అమ్మ ఆయా సందర్భాలు, సంఘటనలనే ఉదాహరణతో చూపుతూ అది తేలిక మాటలతో పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో వేదాంత సారాలు బోధించేవారు.

ఢాకా లో పారులదియా అనే ప్రాంతంలో వృద్ధుడు, సంపన్నుడు అయినా 'రాయ్ బహద్దూర్' అనే వ్యక్తి వుండేవాడు. అతడు శ్రీ ఆనందమయి మాత గురించి విని ఆమెను తన ఇంటికి ఆహ్వానించాడు. భక్తులతో కలిసి అమ్మ వెళ్లారు. అతని కుటుంబం చాలా పెద్దది. తమ గృహంలో కాళీపూజ చేయవలసిందిగా అమ్మను ప్రార్థించాడు. శ్రీ ఆనందమయి అమ్మ వారి ఇంట్లో కాళీపూజ చేయగా, శ్రీ

భోలానాథ్ గారు హవనాదులు చేసి అమ్మ చేసే పూజలో సహకరించారు.

రాయ్ బహద్దూర్ గారికి తన స్వహస్తాలతో అమ్మను పూజించుకోనాలని వుండేది. ఒకసారి తన కోరికను అమ్మతో వెల్లడించి దయతో తమ ఇంటికి రమ్మని ప్రార్థించాడు. అమ్మ అంగీకరించారు. రాయ్ బహద్దూర్ గారు తన కుటుంబ సభ్యులందరితో కలిసి అమ్మను తృప్తిగా పూజించుకొన్నారు. పూజానంతరం కుటుంబ సభ్యులందరూ అమ్మ చుట్టూ కూర్చున్నారు. అమ్మ వారితో "మానవజన్మ అనేది దైవాన్ని చేరుకొనటానికి ఉపయోగపడే ఒక వంతెన, ఒక వాహనం అని చెప్పవచ్చు. ఆ లక్ష్యం వైపే మీ ప్రయాణం సాగాలి" అని చెప్పారు. ముఖ్యంగా పిల్లల నుద్దేశించి అమ్మ యిలా చెప్పారు: "చూడండి మీరంతా చిన్న పిల్లలు మీకు ఎంతో భవిష్యత్తు వున్నది. ముందు ముందు మీరు ఎన్నో జీవిత బాధ్యతలను మోయవలసి వుంటుంది. ఇప్పుడు మీకు ఎటువంటి సమస్యలు లేవు. నిర్వర్తింపవలసిన వ్యవహారాలు అసలు వుండవు. మీరు యిప్పుడు స్వేచ్ఛాజీవులు. పాఠశాలకు వెళ్లి చదువుకొనటం, ఆటపాటలలో గడపటం – ఇవే కదా మీ కార్యక్రమాలు. అయితే ఆటపాటలతో పాటు ప్రతిరోజు దైవ సంకీర్తనలో కొంత సమయం గడపాలి. ఎల్లప్పుడూ భగవన్నామం చేస్తూ వుండేందుకు, నిరంతర నామస్మరణ మీ మనసులో స్థిరపడటం కోసం ఈ వయసు నుండే మీ ప్రయత్నాన్ని ప్రారంభించాలి. నామస్మరణ ఒక అలవాటుగా మార్చుకోవాలి. చిన్న వయస్సులో మొదలైన మంచి అలవాట్లు జీవితమంతా కొనసాగుతాయి. అంతేకాదు, ఈ రాత్రంతా మీ కుటుంబ సభ్యులందరూ సంకీర్తన చేయాలి" అని ఆదేశించారు అమ్మ. ఆ తెల్లవార్లు ఆ కుటుంబసభ్యులు, వారితోపాటు ఇరుగుపొరుగువారు అంతా కలిసి నామసంకీర్తన చేశారు. వచ్చిన వారిలో ముసల్మానులు కూడా వున్నారు. అమ్మ ఆ ముస్లిం జనుల మధ్యకు వెళ్లి కూర్చొని కొంతసేపు అల్లా నామస్మరణ చేయించారు. కులమత భేదాలు లేక శ్రీ ఆనందమయి అమ్మ సన్నిధిలో అందరూ తల్లి ఒడిలో బిడ్డల వలె కలసి మెలసి అమ్మను సేవించుకున్నారు.

అప్పటికి కొంతకాలంగా భక్తులు షాహ్-బాగ్ లో నిరంతర భగవన్నామ స్మరణ, సంకీర్తన ఆరంభించారు. అమ్మ రెండవసారి పారులదియా రాయ్ బహద్దూర్ గారి ఇంటికి వెళ్లినప్పుడు అక్కడ మూడు రోజులు వుండటం జరిగింది. అమ్మ అక్కడకు వెళ్ళిన రోజే అమ్మ దర్శనార్థం కులదాకాంత ముఖోపాధ్యాయ అనే భక్తుడు షాహ్-బాగ్ వచ్చాడు. అమ్మ లేరని తెలిసి ఎంతో బాధపడి అమ్మ దర్శనం అయ్యేంతవరకు షాహ్-బాగ్ విడిచి వెళ్ళకూడదని, అంతవరకు మంచినీరు కూడా ముట్టకూడదని నిర్ణయించుకొని మూడు రోజులు సంకీర్తనలో కాలం గడిపాడు. అతడు అమ్మను అంతకుముందు రెండుసార్లు దర్శించాడు. మూడవసారి యిలా జరగటంతో అతని బాధ వర్ణనాతీతం. నాల్గవ రోజు అమ్మ షాహ్-బాగ్ వచ్చారు. అతడు సంతోషంతో అమ్మను దర్శించుకుని నమస్కరించుకొని చరణధూళి స్వీకరించాడు. అమ్మ స్వహస్తాలతో అందించిన మంచినీరు త్రాగి ధన్యుడైనాడు కులదాకాంత ముఖోపాధ్యాయ. ఆ తర్వాత శ్రీ ఆనందమయి అమ్మ అతని ఆధ్యాత్మిక ఉన్నతికై అతని చేత కొన్ని ప్రత్యేక సాధనలు చేయించారు. అమ్మ ఆశీస్సులతో ఎంతో నియమ నిష్ఠలతో తీవ్రసాధన కొనసాగించాడు కులదాకాంత ముఖోపాధ్యాయ. కొంతకాలం తర్వాత అతడు గృహ పరిత్యాగం చేసి ఆశ్రమవాసిగా స్థిరపడ్డాడు.

శ్రీ ఆనందమయి మాత భక్తులతో వారి వారి మానసిక పరిపక్వతను బట్టి సాధనలు చేయించేవారు .

కాళీపూజ సందర్భంగా అమ్మ ఆదేశం ప్రకారం అమ్మ శరీరకొలతలను బట్టి తయారుచేసిన కాళీవిగ్రహాన్ని పూజానంతరం ఒక ప్రదేశంలో ప్రతిష్ఠించారు. ఆ విగ్రహానికి నిత్యపూజలు జరిపేందుకు కమలాకాంత్ అనే భక్తుని నియమించారు అమ్మ. ప్రతిరోజు అడవల్ పూలమాలతో కాళీమాతను అలంకరించమని చెప్పారు అమ్మ.

గురుప్రియా దేవి తండ్రి శశాంకబాబు కాళీమాత సన్నిధిలో గీతా పారాయణం చేసేవాడు. దుర్గా సప్తశతి చదివేవాడు. కొన్ని నెలల తర్వాత కాళీమాత పూజను శశాంకబాబుని చేయవలసిందిగా అమ్మ చెప్పడంతో ఆయన కాళీమాతకు త్రికాలపూజ, గీత, సప్తశతి పఠనం, నిత్యమూ నియమ నిష్ఠలతో చేయసాగారు.

- సశేషం

దివ్య సన్నిధానములో
జగత్కల్యాణ వేడుకలు!!

శ్రీమతి టి. పద్మావతి

విష్ణు కల్యాణ వైభోగమే!
లక్ష్మి కళ్యాణ వైభోగమే!
భరద్వాజ కళ్యాణ వైభోగమే!
మంగాదేవి కళ్యాణ వైభోగమే!!

ఔను ... మార్చి 6, 2023 వ తేదీన మన గురు దంపతులైన పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ, పూజ్యశ్రీ భరద్వాజ మహారాజుల కళ్యాణం గుమ్మళంపాడు గ్రామ సమీపంలోని 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము' లో అత్యంత వైభవంగా, మహాద్భుతంగా, కన్నులపండుగగా జరిగింది.

మార్చి 4వ తేదీ సాయంత్రానికి పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి నిత్యసత్యులై వెలుగొందుతున్న ఆ ప్రాంగణం అనేక రకాలైన విద్యుద్దీపాలతో కళకళలాడింది. ఆ సువిశాలమైన ప్రాంగణానికి తగ్గట్టుగా ఎంతో విశాలమైన కళ్యాణ వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కళ్యాణం చూడవచ్చినవారందరికి సూర్యభగవానుని తీక్షణతని తట్టుకోవడానికి వీలుగా పెద్ద పెద్ద గుడారాలు ఏర్పాటు చేశారు. మరొకపక్క పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారిచే విరచితమైన గ్రంథాల కోసంఅమర్చినశాల, సమాచారకేంద్రం, వేసవి దాహార్తిని తీర్చుకోవడానికిగాను నిమ్మకాయనీళ్ళు, పానకం, తరవాణి, మంచినీళ్లు సరఫరా చేసే చలివేంద్రాలు – ఒకటేమిటి రకరకాల కుటీరాలు ఏర్పాటు చేయబడ్డాయి. మరొకపక్క వధూవరులకు విడిది ఏర్పాట్లూ అంగరంగ వైభవంగా జరిగాయి.

మార్చి 4వ తేదీ సాయంత్రానికే అనేకప్రాంతాలనించి గురుబంధువులు తరలి వచ్చారు. వారందరికీ 'భక్తనివాస్' లో బస ఏర్పాటు చేయబడింది. పూజ్యశ్రీ భరద్వాజుల వారు, ఈ లోకకళ్యాణానికి కారకులైన వారి గురుదేవులు శ్రీసాయినాథుల వారు కూడా నాలుగవ తేదీ సాయంత్రానికే వారికి ఏర్పాటు చేసిన ప్రత్యేక నివాసానికి విచ్చేసారు. గురుబంధువులందరూ మర్నాడు జరగబోయే కళ్యాణానికి తగిన ఏర్పాట్ల కోసం తలొక సేవా చేస్తూ, హడావిడిగా అటూఇటూ తిరుగుతూంటే, ఆ సందడి చూడటానికి రెండుకళ్ళూ చాలలేదు. జగత్కల్యాణం అంటే మాటలా !!

మామిడాకుల తోరణమ్ములు,
మల్లెపువ్వుల పరిమళమ్ములు,
మంగళా వాద్యముల ధ్వనులు
నింగినంటెను సంబరములు
ముత్యాలముగ్గులూ,
రతనాల రంగవల్లులు,,,,,

అన్నట్లు, ఈ ఏర్పాట్లన్నీ చేస్తూవుండగానే, పూజ్యశ్రీ అమ్మగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి మర్నాడు అంటే 5వ తేదీ సుప్రభాత సేవకి సమయం అయ్యింది. వారిని పూర్ణకలశంతో స్వాగతిస్తూ, ఋత్విక్కులు వేదమంత్రాలు పఠిస్తుండగా గురుకుటుంబం, గురుబంధువులందరూ కలసి వధువు అలమేల్మంగాంబికాదేవిని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విడిదిలో గృహప్రవేశం చేయించి, జయకారం చెప్పుకుని మంగళహారతినిచ్చి సేవించుకున్నారు. అదేవిధంగా వరుడు భరద్వాజగురుదేవులను వారికొరకై ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నివాసం నించి పూర్ణకుంభంతో స్వాగతిస్తూ ఋత్విక్కులు వేదమంత్రగానం

చేస్తుండగా విడిది గృహానికి ఆహ్వానించుకుని, సకలోపచారాలతో మంగళహారతినిచ్చారు. ఇక కళ్యాణానికి తరలివచ్చిన వారందరూ అల్పాహార ప్రసాదం తీసుకున్నాక పెళ్ళికొడుకుని, పెళ్లికూతురిని చేసే ఘట్టం మొదలైంది.

ముందుగా గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు వినయపూర్వక స్వాగతం పలుకుతుండగా, ఈ జగత్ కళ్యాణానికి కారకులైన అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు శిరిడీ సాయినాథుడు కళ్యాణ వేదిక నధిరోహించారు. తరవాత భక్తిపూర్వక ప్రణామాలతో శ్రీ ద్వారకనాథ్ గారు మహాత్ములనందరిని కళ్యాణ వేదికపై సుఖాసీనులను గావించారు. వరుని తరపున శ్రీమతి లయరాగిత – ద్వారకనాథ్ గార్లు, వధువు తరపున శ్రీమతి వేదవతి – శ్రీకాంత్ గార్లు వుండి ఈ ఉత్సవం నిర్వహించారు. పురోహితులు వరుసగా పుణ్యాహవచనం, గణపతిపూజ, పూజ్యశ్రీ అమ్మగారి, పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలకు నమక చమక సహిత పంచామృత అభిషేకం, అనంతరం షోడశోపచార పూజ జరిపించి, సాయినాథునికి, కాబోయే వధూవరులకు పట్టువస్త్రాలు సమర్పించి, మంగళహారతి చేశారు. అంతటితో 5వ తేదీ ఉదయం ఉత్సవాలు పూర్తయ్యాయి.

ఇక సాయంత్రం మంగళ వాద్యాలు మారుమ్రోగగా, వధూవరులిద్దరూ ఎదుర్కోలు కార్యక్రమానికి తరలి వచ్చారు. వారిద్దరి తరపున గురుబంధువులు సారె తీసుకుని వెంట వచ్చారు. వధువు వరుడి తరపువారు, పురోహితులు చెరొకవైపు చేరి, వారి గొప్పతన్నాన్ని వేనోళ్ళ కొనియాడగా, ఒకరికొకరు ముందుకు అడుగులు వేయవలసినదిగా అర్థమొచ్చే గీతాన్ని శ్రీమతి వేదమ్మ, శ్రీమతి లయమ్మల బృందం ఆలపించారు.

పురోహితులు వధూవరులను సాక్షాత్తు లక్ష్మీనారాయణ స్వరూపులుగా కీర్తిస్తూ, స్తుతిస్తూ లగ్నపత్రిక చదివారు. ఆచారాన్ననుసరించి పానకాలు యిచ్చిపుచ్చుకున్నారు. తదనంతరం కాబోయే దంపతులకు కళ్యాణం తిలకించడానికి వచ్చిన భక్తులకు ఆహ్లాదం కలిగించే రీతిన 'శ్రీ నళినీప్రియ కూచిపూడి నృత్య నికేతన్' ఒంగోలు వారు 'శ్రీ శిరిడీ సాయి దివ్య చరితం' నృత్య రూపకం ప్రదర్శించారు. ఆ నృత్యరూపకం మహాద్భుతంగా వుండి ప్రేక్షకులందరిని మహదానందంలో ఓలలాడించింది. అందులో ప్రతి పాత్రధారి చాలా సహజమైన అభినయాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా చావడి ఉత్సవం చూసిన వారందరికీ అలనాటి శిరిడీలో చావడి వుత్సవం యిలాగే వుండి వుంటుంది అన్న అనుభూతిని కలిగించింది. గురుబంధువుల హర్షధ్వానాల మధ్య ఈ వేడుక ముగిసింది. శ్రీ సద్గురు సాయినాథ సహిత అలివేలుమంగా భరద్వాజులకు మంగళహారతినిచ్చి విడిదికి సాగనంపారు.

మార్చి 6వ తేదీ ఉదయం అంగరంగ వైభవంగా జరగబోయే జగత్ కళ్యాణాన్ని వీక్షించడానికి వేల సంఖ్యలో భక్తులు కళ్యాణ మండపానికి చేరుకున్నారు. శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు భక్తిప్రపత్తులతో మహాత్ములని ఆహ్వానిస్తూండగా, భక్తులు ఒకొక్కరూ ఒకొక్కమహాత్ముని వేదికపైకి తోడ్కొని వచ్చారు. తరవాత లోకకల్యాణ కారకులు సాయినాథులవారు పూలవాన కురుస్తుండగా కళ్యాణమండపానికి చేరుకున్నారు. తదుపరి జగన్నాథుడు, సాక్షాత్ నారాయణ స్వరూపులైన భరద్వాజ మహారాజ్ నుదుటన కల్యాణ తిలకధారణతో, బుగ్గన చుక్కతో, అక్కడకి చూడవచ్చిన వారందరిని అనుగ్రహించడానికి చిరునగవులు చిందిస్తూ పూలవానలు కురియగా తమ భక్తబృందం నామ సంకీర్తన చేస్తుండగా కళ్యాణ మండపానికి విచ్చేసారు. వారి వెనుకే జగదానందకారిణి, సాక్షాత్ లక్ష్మీస్వరూపిణి ఐన అలివేలుమంగమ్మ తల్లి నవ వధువు అలంకారంలో చూసీ చూడనట్లు తనభక్తులందరినీ చూసుకుంటూ, సన్నాయి వాద్యకారులు 'బంగారుబొమ్మ రావమ్మా'అంటూ కొనియాడుతుండగా కళ్యాణమండపానికి చేరుకున్నారు. ఇలా వారిద్దరిని వేదిక మీద దర్శించుకున్న భక్తులందరూ అలౌకిక ఆనందాన్ని పొందారు.

కల్యాణ వేడుకల్లో భాగంగా బ్రహ్మపీఠాన్ని అలంకరించిన పురోహితులు పుణ్య దంపతులు అలివేలుమంగా భరద్వాజుల కల్యాణాన్ని అంకురార్పణతో మొదలుపెట్టి కంకణాలు, బాసికాలు ధరింపచేసారు. తెరసెల్లాను అమ్మవారికి అయ్యవారికి మధ్య కాకుండా, ఇది భగవత్ కళ్యాణం కనుక భక్తులకు, భగవంతునికి మధ్యలో ఉంచి "భక్తుడు మాయ

అనే తెరని అమ్మవారి సహాయంతో తొలగించుకుంటే, అయ్యవారిని చేరవచ్చునని దీని భావం" అని వివరించారు.

అనంతరం సుముహూర్తంలో జీలకర్ర-బెల్లం వేడుక జరిపించారు. తరవాత సకల కల్యాణ గుణరాశి అలివేలుమంగమ్మ తల్లి కంఠసీమలో మంగళసూత్రధారణ చేశారు భరద్వాజ గురుదేవులు. బాజా భజంత్రీలు మారుమ్రోగాయి. కళ్యాణానికి విచ్చేసిన మహాత్ములు, దివిలోని దేవతలు సకల సృష్టి శుభాభినందనలు తెలియచేయగా భక్తులందరి హృదయాలూ ఆనందంతో ఉప్పొంగాయి. తదనంతరం భక్తులు నామం చెప్తూ ఏరిన బియ్యంతో అక్షతారోహణం మాలా పరివర్తనం జరిగింది. ఉత్సవంలో చివరగా కళ్యాణానికి ఎవరైతే కారకులయ్యారో ఆ సాయినాథునికి వధూవరులిద్దరూ శరణాగతి చెందటం, అంటే మన వైపు నించి బాబాకి అప్పగింతలు అనే కార్యక్రమం జరిగింది.

నూతన వధూవరులకు, సాయినాథునికి, మహాత్ములకు విందుభోజనం నివేదించి, మంగళహారతులిచ్చారు. ఈ జగత్కల్యాణాన్ని చూడవచ్చిన వారందరూ, సాక్షాత్ లక్ష్మీనారాయణ స్వరూపులైన గురుదంపతులను చూసి, ఏమి మా భాగ్యమని ఆనందిస్తూ హృదయపూర్వకనమస్కారములర్పించి ప్రసాదాన్ని స్వీకరించి తరించారు.

జై సాయి మాస్టర్!!

ఆచార్యుని అద్భుత బోధలు

09వ పేజీ తరువాయి

పాపంలో కూడా భాగం సంక్రమిస్తుంది. అంతేగాక, మనకు అవతలివారిని విమర్శించటం అన్న దుర్గుణం అలవాటై ఇంకా ఇంకా అవతలివారిని విమర్శిస్తూనే వుంటాం. దానివల్ల మనలో మనం మంచివారమన్న అహంభావం, అవతలివారు చెడ్డవారన్న అభిప్రాయమూ ఇంకా ఇంకా బలపడుతూ పోతాయి. వాటిని తొలగించుకోవడం మరింత కష్టతరమౌతుంది. మనం ఇతరులను విమర్శించిన కొద్దీ అవతలివారు ఊరుకోరు కదా! వారు కూడా మనలను విమర్శిస్తూనే వుంటారు. అందువల్ల అవతలివారూ, మనమూ నిరంతరం ఒకరినొకరం విమర్శించుకుంటూ ఈర్ష్యాద్వేషాలు పెంచుకుంటూ మనశ్శాంతి లేకుండా చేసుకుంటాం. ఇక దీనికి అంతెక్కడ?

ఉత్తమమైన మానవ జన్మను ఎత్తి, ఇట్టి జన్మను ప్రసాదించిన భగవంతుని పట్ల కృతజ్ఞతతోనూ, భక్తిభావంతోనూ మెలుగుతూ ఆయనను స్మరించక ఇలా కాలాన్ని వృథా చేసుకోవడం వల్ల వచ్చే లాభమేమీ వుండదు. ఎన్ని యుగాలు గడిచినా మనుషుల మనస్తత్వాలు ఇలాగే వుంటాయి. మనలాగే క్రిందటి తరాలలో గూడా మంచివారూ, ఒకరినొకరు దూషించుకున్నవారూ కూడా వున్నారు. వారందరూ ఈనాడు ఏరీ? కాలగర్భంలో కలిసిపోయారు. ఏదీ శాశ్వతం కాదు. అంతా నశించి పోయేవే. మనం చేసిన కర్మలను బట్టి మనకు ముందు జన్మలు లభిస్తాయి. అందుకని మహాత్ములు చెప్పిన సూక్తులను ఆచరిస్తూ, వారిని సేవిస్తూ వుండడం ఒక్కటే మనం చేయవలసినది. అప్పుడు మనకు ఇటువంటి పనికిమాలిన ఆలోచనలు రాకుండా, ఏది మనకు ఉత్తమ జన్మలను ప్రసాదిస్తుందో అట్టి స్మరణ జరుగుతుంది. అందుకని మనం చేయవలసినది మహాత్ములు చెప్పినవాటిని ఆచరించడానికి ప్రయత్నించడమే." మాస్టరుగారు అతనికి యిలా వివరించి చివరగా ఇలా అన్నారు:

"ఇప్పుడు నేను చెప్పిన దానిని నువ్వు కూడా ఆలోచించు. నేను చెప్పినదానినే ఆచరించాలని నేనెప్పుడూ చెప్పను. నువ్వుకూడా ఆలోచించి ఇది సమంజసమైనదని నీకు కూడా అనిపిస్తే ఆచరించడానికి ప్రయత్నించు. అప్పుడు నీ మనస్సు ఎంత ప్రశాంతంగా వుంటుందో నీవే అనుభవించగలవు. నేను చెప్పినది నీకు కష్టమనిపించినా నాకదే శ్రేయస్కరమనిపిస్తుంది. కనుక నేను దానినే చెబుతాను. నీకిష్టముంటే స్వీకరించు. నీకు నచ్చకపోయినా నేనేమీ అనుకోను. నేను చెప్పినది నీకు నచ్చాలని ఎక్కడున్నది?" అన్నారు.

ఇట్టి అమృతవాక్కులు పూజ్యశ్రీ మాస్టరుగారి మధురకంఠంలోనుంచి నిరంతరం ప్రవహిస్తూనే వుండేవి. వాటిని స్వీకరించి ఆచరించినవారు ఎంతటి ధన్యులో!!

మార్గం చూపిన మహనీయుడు

శ్రీమతి సరోజనమ్మ

(వీరికి మాస్టరుగారితో పరిచయభాగ్యం కలిగిన నాడే వారి దివ్యత్వాన్ని గుర్తించి వారి పాదాలు పట్టుకుని అనన్యంగా వారినే ఆశ్రయించి ఎన్నో దివ్య దర్శనాలను పొందిన తరువాత ఎన్నో అభీష్టాలు నెరవేరిన వైనాన్ని మరియు మాస్టరుగారి సమాధి ఘట్టాన్ని కళ్ళకు కట్టినట్టు అందిస్తున్నారు.)

అక్కడ్నుంచి కురువపురం వెళ్ళాం. కురువపురంలో ఎండ మాడ్చేస్తుంటే "అయ్యో మాస్టారుగారు చెప్పులు లేకుండా నడుస్తున్నారే. మాస్టారుగారూ నా చెప్పులేసుకోండి" అంటే "అహహ వద్దమ్మా" అని అన్నారు. నేను కూడా మొండి దాన్నే. రెండు టవల్స్ వుంటే దారి పొడుగునా టవల్స్ పరుచుకుంటూ వెళ్ళాం. "ఎందుకమ్మా మీకు శ్రమ" అంటూ ఆయనొప్పుకోలేదు. "మీ కాళ్ళు కాల్తుంటే నాకు బాధగా లేదా? అంటే, "ఎందుకమ్మా అంత శ్రమ పడ్తారు" అని ఒప్పుకోలేదు. తప్పనిసరై ఇంక మానేశాం. అక్కడ చెట్ల కింద ఆగి వుపన్యాసం చెప్పారు. ఎంతో ఆనందంగా వుంది, అలా చెట్ల కింద కూర్చుని వింటుంటే. అక్కడ ఫొటో తీయించుకుందా మనిపించి మాస్టారు గారిని అడిగితే వచ్చి నిల్చున్నారు. పైన తుండుగుడ్డ, అడ్డ పంచ, ఆ యాత్ర జ్ఞాపకంగా ఆ ఫొటోను ఇప్పటికి జాగ్రత్తగా పదిల పరుచుకున్నాం. అక్కడ్నించి నర్సోబావాడి వెళ్ళాం. ఆ తర్వాత మహానంది. అట్లా అట్లా తిరిగి ఒంగోలు చేరుకున్నాం. అట్లా మాస్టారుగారితో చేసిన మా యాత్రను నేను జీవితంలో మరిచిపోలేను. ఇప్పుడు కూడా రాత్రి పూట నిద్ర పట్టకపోతే ఇవన్నీ తలచుకుంటూ, అట్లా మానసికంగా ఆ ప్రదేశాలన్ని తిరిగి వస్తుంటాను. ఈ వయసులో శరీరం పోలేదుగా.

ఒకసారి మాటల సందర్భంలో మాస్టారుగారికి బూడిద గుమ్మడి కాయ దోసెలంటే భలే ఇష్టమని తెలిసి, చాలాసార్లు మా దొడ్లో కాచిన గుమ్మడి కాయలు తీస్కెళ్ళి ఇస్తుండే దాన్ని. "తరచుగా తింటే నడుములు పట్టుకుంటాయి" అని అన్నారు నవ్వుతూ.

1989 ఏప్రియల్ పదకొండవ తారీకున సాయంత్రం 6 గంటలకు మాస్టారు గారింటి కెళ్ళాను. మాస్టారుగారు లోపలనుండి బయటకు వచ్చి, "ఏమ్మా బాగున్నావా?" అన్నారు. "బాగున్నానండి. మీరేంటండి అలాగున్నారు?" అని అడిగాను అస్వస్థతగా వున్నట్లు కన్పిస్తే. "నాకు ఒంట్లో బాధగా వుందమ్మా, ఇదంతా పట్టేసినట్లున్నది (గొంతు దగ్గర చూపిస్తూ) చిక్క పట్టినట్లు వున్నదమ్మా, అందువల్ల నాకు బాధగా వుంది. మీరు మందిరం దగ్గరకెళ్ళి సుబ్బలక్ష్మమ్మగారితో డాక్టర్ గారిని పంపమని చెప్పండి. ఆమె గనుక డాక్టర్ గారికి చెప్పకపోతే అప్పుడు నేను వుపన్యాసానికి వస్తాను" అని చెప్పారు. నేను, సరోజనమ్మగారు కలిసి మందిరానికి వచ్చాము. సుబ్బలక్ష్మమ్మ గారితో ఈ మాట చెప్పాము. ఆమె "డాక్టర్ గారెళ్ళారు" అని అన్నారు. మందిరంలో వుపన్యసించడానికి ఆ రోజు మాస్టరుగారు రాలేదు.. కాసేపు కూర్చుని దాదాపు తొమ్మిది గంటలకి ఇంటికొచ్చి, "అయ్యో! మాస్టార్ గారికి బాగా లేదు. రెండు కొబ్బరి బోండాలు కొట్టి తీసుకు వెళదాము" అని, మాస్టార్ గారింటికి తీసుకెళ్లాను. మాస్టార్ గారు పడుకుని వున్నారు "తర్వాత తాగుతాను. అక్కడ పెట్టండి" అని, "అమ్మా! రేపట్నించీ జనాలు చాలా మంది వస్తారు. అక్కల్కోట స్వామి వారి పాదుకలు వచ్చి వున్నాయి. కదా! రేపు ప్రొద్దున ఊరేగింపు వుంటుంది. హారతిచ్చుకో. ఆ తర్వాత చాలా మంది జనాలొస్తారు. సేవచేసుకో, స్వామి మీ ఇంటి కొస్తారు" అని చెప్పారు. చెప్తుంటే

నాకెందుకో చాలా దుఃఖం వచ్చింది. అది ఆనందమో, దుఃఖమో తెలీదు. సరేనని ఇంటి కొచ్చేశాం. మరుసటి రోజు అంటే ఏప్రియల్ 12వ తేదీ పొద్దున్నే మాస్టరుగారికి బాగాలేదు కదా! చూసివద్దామని వారింటికెళ్ళాను. ఆయన పడుకొని వున్నారు. అయోధ్య గారు అమ్మ గారు ముగ్గురూ మాట్లాడుకుంటున్న సమయంలో వచ్చాను. "మాస్టారండి బాగున్నారా?" అని వారిని అడిగితే, ఆయన నావైపు వెనక్కి తిరిగి చూసే సరికి నాకు ఒక అపురూపమైన అనుభవం కలిగింది. కృష్ణ దర్శనం అయిందండి. కృష్ణునిగా, బాల కృష్ణునిగా దర్శన మిచ్చారు. అబ్బ ఎంత చక్కగా ఎంత అందంగా వున్నారండి మాస్టార్ గారు. ఎలా వున్నారండి అని అడిగితే, ఇప్పుడు చాలా బాగున్నానమ్మా అని ఆశీర్వదించారు. ఇక వెళ్దామని రాబోతుంటే, "అమ్మా, అక్కల్ కోట స్వామి పాదుకలు వచ్చాయి. వూరేగింపు వుంటుంది. హారతిచ్చుకో పొమ్మా. సేవలు చేసుకోమ్మా" అన్నారు మాస్టరుగారు.. నేను ఇంటి కెళ్ళగానే వూరేగింపు మా ఇంటి దగ్గర కొచ్చినప్పుడు కొబ్బరికాయ కొట్టి హారతిచ్చుకున్న తరువాత, సుబ్బలక్ష్మమ్మగారుండి మందిరం దాకా రమ్మనమంటే వెళ్ళాను. వాకిట్లో కెళ్ళి హారతి ఇవ్వడానికి ఇంత పెద్ద కర్పూరం ముద్ద వెల్లించి ధుని దగ్గర హారతి ఇవ్వాలని వెళ్లిస్తే చప్పున అరిపోయింది. అలా అది ఆరిపోయేసరికి ఆమె నావైపు చూస్తూ "గాలిలే. మీకు వూరికినే అనుమానం" అన్నారు. మందిరం నుంచి మేమింటికొచ్చేసరికి, మాస్టరుగారికి బాగాలేక అయోధ్యగారు ఆస్పత్రికి తీసుకెళ్ళారని తెలిసి, హాస్పిటల్ కి పరుగెత్తాను. అప్పటికే అంతా అయిపోయింది. అప్పటికే అక్కడ వున్న వారందరి పరిస్థితి హృదయ విదారకంగా వున్నది. ఆ తర్వాత ఈ వార్త చెప్పటానికి నన్ను అమ్మగారి దగ్గరకు పంపారు. అమ్మగారి దగ్గర కెళ్ళాను. అమ్మగారు నన్ను చూసి, "ఏమ్మా హాస్పిటల్ కెళ్ళొచ్చావా?" అన్నారు. "అవునమ్మా నేనక్కడ్నించే వస్తున్నాను" అన్నానో లేదో, "మాస్టారుగారికి బెడ్ ఇచ్చారా? సెలైన్ పెడ్తున్నారా? వారు మాట్లాడ్తున్నారా? అన్నీ బాగా చూసొచ్చావా?" అని ఒకదాని వెంట ఒకటి వరుసగా ప్రశ్నలు అడుగుతూనే వున్నారు. నాకేం చెప్పాలో తెలియక ఒణికి పోతున్నాను. అప్పుడు అమ్మగారు. "ఏంటి ఇలా వున్నారు?" అని నన్ను పట్టుకుని కౌగలించుకుని నా హృదయంపై తల ఆనించారు చప్పున ఏ మాటా లేకుండా! స్పృహ తప్పిందో, లేక ధ్యానమే చేసుకుంటున్నారో నాకైతే తెలీదు. నేను చాలాసేపు "అమ్మగారు, మీరు ధైర్యం తెచ్చుకోవాలి. సుబ్బలక్షమ్మగారు చెప్పమన్నారు. మీరు ధైర్యంగా వుండాలి. అయోధ్యగారు చెప్పమన్నారు. మీరు ధైర్యంగా వుండాల్సిన సమయం" అని నాలుగైదు సార్లు మళ్ళీ మళ్ళీ చెప్పాను. ఇంతలో మాస్టార్ గారిని వాన్ లో తీసుకొని వచ్చారు. ఆయన ఎప్పుడూ ఎక్కడ కూర్చుంటారో అక్కడే పడుకోబెట్టారు. అప్పుడు నా నోటితో చెప్పలేక "అమ్మగారు అర్థం అయిందామ్మా" అని పదే పదే అడిగాను. అప్పటికి ఆమె కళ్ళు తెరచి "గురుదేవా" అని తిరిగి స్పృహ తప్పిపడిపోయారు.

ఆ తర్వాత నుంచి ఒకటే జనం..... జనం జనం... మాస్టారు గారు సమాధి అయిన వార్త కార్చిచ్చులా వూరంతా తెలిసి ఒకటే ప్రవాహం, జన ప్రవాహం. మా ఇల్లు మాస్టారు గారింటి కెళ్ళే దోవలోనే వుంది. వీధి వీధంతా జనంతో నిండిపోయింది. చాలామంది చోటు లేక మా ఇంట్లో కొచ్చి కూర్చున్నారు. జనం తండోప తండాలుగా వస్తూనే వున్నారు. ఎండాకాలం. అందరూ వచ్చి మంచి నీళ్ళు అడుగుతుంటే మేం ఇస్తుంటే "చేతనైనంత సేవ చేసుకోమ్మా" అన్న మాట గుర్తొచ్చి అప్పుడు ఏడ్చాను. "రేపు నువ్వు సేవ చేసుకో. చాలా మంది జనాలొస్తారు" అన్న మీ మాటలకు అర్థం ఇదా? అప్పుడు దుఃఖపడ్డాను..

ఆ మర్నాడు అంటే ఏప్రియల్ 13 వ తేదీ మధ్యాహ్నం ఆయన అంతిమ యాత్ర మొదలైంది. "ద్వారకామాయి" అంటే మాస్టరుగారున్న యింటి నుండి పెద్ద వూరేగింపు బయల్దేరింది. అప్పుడు వూరేగింపు మా యింటి దగ్గరకు వస్తే ఆయనకు హారతిచ్చుకున్నాను కడసారిగా. ఆ తర్వాత నేను మాస్టారుగారిని సమాధి చేసే స్థలం దగ్గర కెళ్ళి వారిని సమాధి చేసే వరకు అక్కడే కూర్చున్నాను. ఆ తర్వాత మాస్టార్ గారు రెండు మూడు సార్లు కలలో కన్పించారు. కన్పిస్తే "ఇదేమిటి మాస్టారుగారు ఇలా వెళ్ళిపోయారు" అంటే "అంతా దైవ నిర్ణయం అమ్మ, బాబా నిర్ణయం" అని అన్నారు.

మేం ఇప్పటికీ ఆయన చెప్పిన మార్గంలోనే నడుస్తున్నాం. 'గురుచరిత్ర' – 'సాయి చరిత్ర' పారాయణ చేస్తూనే వున్నాము. ఆయన వ్రాసిన అన్ని పుస్తకాలు చదువుతున్నాము. మాకు భగవంతుడు, గురువు, దైవం అన్నీ ఆయనే!

(గత సంచిక తరువాయి)

మరికొందరు భక్తులు

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

డోలస్

ఆనందరావ్ పరశురామ్ డోలస్ (అంధేరీ) 1917లో స్థిరమైన ఉద్యోగము లేక బాధపడుతూండేవాడు. అతడొకరోజు, "బాబా, నాకు స్థిరమైన ఉద్యోగమొస్తే నా మొదటి నెల జీతంతో నేను శిరిడీ దర్శించి మీకు దక్షిణ సమర్పిస్తాను" అని మొక్కుకున్నాడు. కొద్దికాలంలో అతనికి నెలకు ₹35/-లు జీతంమీద ఒక స్థిరమైన వుద్యోగం వచ్చింది. అనుకున్న ప్రకారమే అతడు మొదటి నెల జీతంతో ₹20/-లు బస్ ఛార్జీలకు, మిగిలిన ₹15/-లు పై ఖర్చులకు కేటాయించుకొని శిరిడీ బయల్దేరాలనుకున్నాడు. సరిగ్గా సమయానికి స్థానిక పాఠశాలలో హెడ్ మాస్టర్ గా పనిచేయుచున్న బేండ్రే గూడ సకుటుంబంగా అతనికి ప్రయాణంలో తోడయ్యాడు.

అందరూ శిరిడీ చేరిన సమయంలో బాబా లెండీకి వెళ్తున్నారు. ఈ భక్తులు తమ సామానులు దీక్షిత్ వాడాలో పెట్టుకొని వచ్చి బాబాకు నమస్కరించుకున్నారు. తర్వాత అందరూ స్నానాలు పూర్తిచేసుకొని మరలా ఆయన దర్శనానికి ద్వారకామాయికి వెళ్ళారు. ఆ సన్నివేశాన్ని డోలస్ ఇలా వర్ణించాడు : "ఆ సమయంలో భక్తులెందరో మశీదు నిండుగా కూర్చుని వుండడం వలన మా బృందమంతా ఒక ప్రక్కగా నిల్చొని బాబా దర్బార్ ను తిలకిస్తున్నాము. ఆ సమయంలో శ్రీమాన్ బూటీ పొగాకు నలచి చిలిమ్ గొట్టంలో వేసి వెలిగించి బాబాకు అందించాడు. బాబా దానినందుకుని పొగ పీలుస్తూ నాకేసి చూసి, ఆ వెంటనే ఆ చిలిం నాకందించ జూచారు. నేను వయస్సులో చిన్నవాణ్ణవటం వలన వెనకాడుతూ, 'నేను వయసులో మరీ చిన్నవాణ్ణి. నాకు పొగత్రాగే అభ్యాసంకూడా లేదు' అన్నాను. అప్పుడు బాబా ఆ చిలిం యింకొకరికిచ్చారు. భక్తులందరూ ఒకరి తర్వాత ఒకరు ఆ చిలిం పీలుస్తున్నారు. ఇంతలో బాబా నాకేసి చూచి ₹10/-లు దక్షిణ కోరారు. నేను వెంటనే వాడాకు వెళ్ళి ₹10/-లు తెచ్చి వారికి సమర్పించాను. ఆయన బేండ్రే నుండి గూడ దక్షిణ కోరితీసుకున్నారు. నా సోదరి అచ్చటి స్త్రీల మధ్యలో కూర్చోనుంటే ఆమెను గూడ దక్షిణ అడిగి తీసుకున్నారు. అటు తర్వాత మరలా బాబా నావైపు చూచి దక్షిణ కోరారు. నేను మరలా వాడా నుండి ₹.10/-లు తెచ్చి వారికి సమర్పించాను. చివరకు నేను బాబాకు ఎంత దక్షిణ సమర్పించానో లెక్కచూచుకొంటే మా తిరుగు ప్రయాణానికి డబ్బు తరుగయ్యేలాగా వున్నది. నేను శిరిడీ దర్శించటం అదే ప్రథమం గనుక, ఆ పైకం అప్పు తీసుకోడానికి అక్కడ నాకెవరూ తెలియదు. బేండ్రేగారిని అడిగితే ఆయన తమతో అదనంగా పైకమేమీ తేలేదనీ, సాయికి మొక్కుకున్న పైకం నుండే తమ ఖర్చులకు చాలినంత మాత్రం తెచ్చుకున్నామని చెప్పాడు. మేమంతా ఆందోళన పడుతుంటే, మాతో కూడ వచ్చిన ఒక వృద్ధురాలు, "సాయి పాద సన్నిధికి వచ్చాక గూడ యిలా కంగారు పడతారేమి? మీపట్ల ఎంతో అనుగ్రహం వుండబట్టే బాబా మీ దగ్గర దక్షిణ అడిగి తీసుకున్నారు. అదే మావద్ద నుండి చూడండి, ఒక్క పైసా అయినా స్వీకరించలేదు. కనుక మీ అందరినీ ఆయనే ఇల్లు చేరుస్తారు, భయంలేదు. అంతగా అవసరమైతే ఆ పైకం నేనే యిస్తాను, మీకు వీలున్నప్పుడు తిరిగి యిచ్చేద్దురుగాని" అన్నది.

రాత్రి భోజనమయ్యాక బాబా ఛత్ర ఛామరాలు, నెమలి కన్నుల కుంచెలతో చావడికి బయల్దేరారు. అదంతా చూస్తుంటే నాకు గూడ చామరం చేతబట్టి బాబాకు విసరాలనిపించిది. అయినా నేను కొత్తవాణ్ణి గనుక మరొకరి చేతిలోంచి అది తీసుకొనడానికి కొంచెం వెనుకాడాను. కాని చిత్రం! ఆ క్షణంలో చామరంతో బాబాకు వీస్తున్న వ్యక్తి తనకై తానే ఆ చామరం

నాకిచ్చాడు. నేను సంతోషంగా సాయిసేవ చేసుకున్నాను.

అప్పటి నుండి అన్నా సాహెబ్ దభోల్కర్, పురందరే మొ॥న వారితో కలసి అప్పుడప్పుడు నేను గూడ శిరిడీ వస్తూండేవాడిని. బాబా మహాసమాధి చెందడానికి ముందటిరోజు, అక్టోబర్ 14, 1918 నాటి రాత్రి నా సోదరికి నేను శిరిడీ నుండి ఊదీ ప్రసాదం మాత్రమే తీసుకొచ్చినట్లు, బాబా పాదతీర్థం తీసుకురానట్లు స్వప్నం వచ్చింది. ఆ కలలోనే ఆమె అందుకు నన్ను కేకలువేస్తున్నది. ఆ మరురోజే బాబా మహాసమాధి చెందినట్లు మాకు వార్త అందింది. ఇక నుండి బాబా పాదతీర్థం మాకు లభించబోదని బాబా మాకు ముందుగానే దృష్టాంతమిచ్చారు.

విఠల్ యశ్వంత్ దేశ్ పాండే

బొంబాయి (దాదర్)లో నివసిస్తున్న యశ్వంత్ దేశ్ పాండే (సుమారు 80సం॥లు) యిలా చెప్పాడు: "ఒకప్పుడు మా తాత (మా అమ్మగారి తండ్రి) గారికి కళ్ళ జబ్బు చేసింది. ఎంతమంది చికిత్సలు చేసినా, క్రమంగా వ్యాధి ముదిరి దృష్టి పూర్తిగా లోపించింది. ఆ రోజులలో శ్రీ గోవిందరావు బాలక్ రామ్ మాన్కర్ అను గొప్ప సాయి భక్తుడు వంటరిగా బాంద్రాలో నివసిస్తుండేవాడు. ఎందరో తమ బాధలు నివారించుకోడానికి అతనిని దర్శిస్తుండేవారు. మేమాయన వద్దకు వెళితే, శిరిడీలో సాయిబాబాను దర్శించమని చెప్పాడు. నేను మా తాతను తీసుకొని 1916లో శిరిడీలో మశీదు చేరగానే, బాబా మాకేసిచూచి నవ్వుతూ ₹16/- లు దక్షిణ కోరారు. అపుడు మాదగ్గర అంత డబ్బు లేదు. నేను ₹10/-ల నోటు యివ్వబోతే, బాబా అడ్డంగా తలవూపి, ₹16/-లు యివ్వాలని పట్టుబట్టారు. మా తాతను మశీదు ముంగిట ఖాళీ స్థలంలో కూర్చోబెట్టి, నేను ₹10/లు నోటు చిల్లర మార్చడానికి వెళ్ళాను.

ఆ రోజులలో అక్కడ ఒక చిన్నవీధి, దానికి అవతల గోడ వుండేది. నా దగ్గర మొత్తం రెండు పదిరూపాయల నోట్లున్నాయి. మా తాతతో చెప్పి, చిల్లర కోసం బయటకు వెళ్ళి ప్రతి అంగడికీ తిరిగాను. కాని ఎవరూ చిల్లర యివ్వలేదు. నేను పూర్తిగా అలసిపోయాను. నాకు దుఃఖం పొర్లుకొస్తున్నది. చిల్లర దొరక్కపోతే బాబాకు దక్షిణ సమర్పించేదెలా? నేను నిస్సహాయుడనై కన్నీరు కారుస్తూ రోడ్డు ప్రక్కన నుంచున్నాను. ఇంతలో ధోవతి, కోటు, తలపాగా, నుదుట గంధమూ ధరించిన ఒక పెద్దమనిషి నాచెంతకొచ్చి వీపుతట్టి, నా దుఃఖానికి కారణమడిగారు. నేను చెప్పగానే ఆయన తమ జేబులోంచి పది రూపాయినాణాలు నా చేతిలో వేసాడు. నేను నోటు వారికిచ్చి పరుగున మశీదుచేరి ₹16/-లు బాబా చేతిలో వుంచాను. ఆయన, 'భయపడకు, భగవంతుడు మేలుచేస్తాడు. నీవు వచ్చిన పనెప్పుడో పూర్తయింది. మీరిక వెళ్ళవచ్చు' అన్నారు. నాకేమీ అర్థం కాలేదు. మేమెందుకు కొచ్చామో ఆయన అడగనూలేదు, మేము చెప్పనూ లేదు. నాకేమీ అర్థంగాక చూస్తుంటే వారు మరలా అలానే అన్నారు.

నేను బాబాకు నమస్కరించి మశీదు మెట్లు దిగేసరికి, ఆ ముంగిట్లో మా తాత ఎక్కడా కనిపించలేదు. నాకుచెప్పలేనంత భయమేసింది. కళ్ళులేని ఆయన ఎటు వెళ్ళాడో, ఆయన కేమౌతుందోనన్న కంగారుతో అన్ని దిక్కులకూ పరుగులు తీసాను. ఆయనెక్కడా కన్పించక పోయేసరికి ఆయన ఏమైపోయాడోనన్న భయంతో ఒకచోట నిలబడి పెద్దగా ఏడుస్తున్నాను. కొద్ది సేపట్లో అంతకుముందు చిల్లరిచ్చిన పెద్దమనిషే నాదగ్గరికి వచ్చి విచారించి, "ఏడవకు, భయంలేదు, మీ తాతను చూపిస్తా రా" అంటూ నాచేతులు పట్టుకొని గబగబా వాడావద్దకు తీసుకెళ్ళాడు. ఆయన వేగంగా నడుస్తూంటే నేను ఆయనతో కూడా పరుగెత్తవలసి వచ్చింది. మా తాత రోడ్డు ప్రక్కన ఒకచోట కూర్చొని చెరుకుముక్క నముల్తున్నాడు. నేను పట్టరాని కోపంతో, 'నువ్వొక్కడివే బయటకెందుకొచ్చావ్? ఎక్కడయినా ఏదైనా తగిలి నీవు పడిపోతే ఎంత ప్రమాదం? నీకోసం వెతకలేక చచ్చాను. ఏమైపోయావో తెలియదు!' అన్నాను. మా తాత నాకేసి చూసి నవ్వుతూ నాచేయి పట్టుకుని, తనకు దగ్గరగా కూర్చోబెట్టుకొని, 'చిన్నా! నీవు చిల్లరకోసం వెళ్ళగానే కొద్ది క్షణాల తర్వాత అకస్మాత్తుగా నాకళ్ళు కన్పించనారంభించాయి. నేను నీకోసం కొద్దిసేపు వేచిచూచి, నీకోసం వెతికినట్లు వుంటుంది, గ్రామం చూచినట్లూ వుంటుందని బయటకొచ్చాను. నీవు కన్పిస్తావనే యిక్కడ కూర్చున్నాను. మరలా మశీదుకే వెళదామనుకుంటుండగా నువ్వే వచ్చావు!' అన్నాడు. నా ఆశ్చర్యానికి మేరలేదు. బాబా అన్నమాటలప్పుడు అర్థమయ్యాయి. మేమిద్దరమూ యిల్లుచేరి, జరిగినదంతా చెప్పేసరికి అందరూ ఆశ్చర్యపోయారు. ఈ వింత చూడవచ్చే వాళ్ళతో కొద్దిరోజులపాటు మాయిల్లంతా సందడిగా వుండేది."

అతడు చూచినప్పుడు బాబా రూపం ఎలా వున్నదని అడిగితే యశ్వంత్ దేశ్ పాండే యిలా చెప్పాడు : ''ఆయన

ఆజానుబాహువు అంటే ఆయన చేతులు పొడవుగా మోకాళ్ళవరకూ వున్నాయి. ఆయన శరీరచ్ఛాయ ఎంతో కాంతివంతంగా వున్నది. ఆయన హిందీలోనూ, మరాఠీలోనూ మాట్లాడారు. తురిమిన ఎండుకొబ్బరి, కలకండ కలిపిన ప్రసాదము, ఊదీ భక్తులకిస్తున్నారు. ఎప్పుడూ ఆయన సన్నిధిలో పాతిక, లేక ముప్పైమంది భక్తులుండేవారు. ఆయన భక్తునికి సెలవిచ్చేప్పుడు సామాన్యంగా పురుషులకు మాత్రమే నొసట విభూతి పెట్టి, తలమీద చేయి పెట్టి ఆశీర్వదించేవారు. ఆరతి సమయంలో ఆయన ముఖం ఒక వింతైన దివ్యవర్చసుతో వెలిగిపోయేది. మశీదు ముంగిట్లో భక్తుల మధ్య చక్కగా అలంకరించిన 'శ్యామ సుందర్' అనే గుఱ్ఱం నిశ్చలంగా నిలబడేది. ఆరతి అయ్యాక ఆ గుఱ్ఱం తన ముందు కాళ్ళువంచి తన నొసటితో నేలను తాకి నమస్కరించేది.

బాబా దగ్గర సెలవు తీసుకోనిదే ఎవరూ శిరిడీ విడిచి వెళ్ళేవారుకాదు. ఒకసారి మాత్రం తొందరలో నేను బాబా అనుమతి తీసుకోకుండా శంకర్రావ్ షిండే అనే భక్తుని కారులో దామోదర్ రాస్నేతో కలసి బయల్దేరాను. అహ్మద్ నగర్ దగ్గర వేగంగా పోతున్న మా కారు ఒక వ్యక్తిని గుద్దేసింది. అతడు స్పృహతప్పి పడిపోయాడు. భయంతో మాకేం చేయాలో పాలు పోలేదు. అప్పుడు రాస్నే, అతని నొసట కొంచెం బాబా ఊదీ అద్ది, కొంచెం అతని నోట్లో వేసి, కొంచెం గుండెలకు, పొట్టకూ రాసాడు. కొద్ది సేపయ్యాక అతడికి స్పృహవచ్చింది గాని, అతని కాలు మాత్రం విరిగిపోయింది. వెంటనే అతనిని దగ్గర్లోని ఆస్పత్రిలో చేర్చాము. వెంటనే అతనిని రక్షించమని కోరడానికి బాబా వద్దకు రాస్నే, షిండేలు తిరిగి వెళ్ళారు, నేను అహ్మద్ నగర్ నుండి యింటికి వెళ్ళిపోవడానికి గూడా బాబా అనుమతి కోరమని చెప్పాను. తర్వాత అతడు త్వరలో కోలుకున్నాడు.

బాబా మహాసమాధి చెందాక గూడా వారి కృప నాకు అనుభవమౌతూనే వున్నది. అన్నింటిలోకి ముఖ్యమైనది 1968లో అనంత చతుర్దశినాడు జరిగినది. కాషాయము, రుద్రాక్షలు ధరించిన ఒక సన్యాసి మాయింటి ఎదుటకొచ్చి 'నాకు కొంచెం టీ కావాలి, యిస్తారా?' అని హిందీలో అడిగారు. నేను వారిని లోపలికి పిలిచి కూర్చోబెట్టి, 'చెక్కరవేసిన పాలిమ్మంటారా' అని అడిగితే ఇవ్వమన్నారు. ఇంట్లోనుంచి పాలు తీసుకొచ్చియిచ్చేదాకా ఆయన మౌనంగా కూర్చున్నారు. వారికేసి చూచేసరికి ఆయనకు బదులు సాయిబాబా కూర్చొని వున్నారు. నేను పట్టలేని ఆనందము – ఆశ్చర్యాలతో నమస్కరించుకున్నాను గాని నానోట మాట రాలేదు. నన్ను చూచి యింట్లో వారంతా ఆయనకు నమస్కారం చేసుకున్నారు. ఇంతలో వారు పాలుత్రాగి అకస్మాత్తుగా లేచి బయటకు వెళ్ళిపోయారు. వారు తిరిగి వస్తారేమోనని ఒక్క నిమిషం చూచాను. రాకపోయేసరికి నేను బయటకు వెళ్ళి చూచాను. ఆయనెక్కడా కనబడలేదు. పొరుగువారిని విచారిస్తే అలాంటి వ్యక్తిని వారు చూడనేలేదన్నారు. ఇలా ఎన్ని జరిగాయో! గత 33 సం॥లుగా మేమెప్పుడూ డాక్టరు వద్దకు వెళ్ళడమే లేదు; ఎటువంటి వ్యాధియైనా విభూతితో తృటిలో తగ్గిపోవల్సిందే."

- సశేషం

కొత్త యుగానికి కొత్త మతం

05వ పేజీ తరువాయి

ఈనాడు చేస్తూ పూర్ణపురుషుని గుర్తించి సేవించడమనే మరొక ధర్మాన్ని మనకు చూపుతున్నారు. సాయి బోధించిన యీ పరమ సత్యాలను ఆకళింపు చేసుకొంటే సాయి పేరిట గురుత్వం సంపాదించుకొందామన్న కొందరు భక్తుల వైఖరి కేవలం బాల్యచేష్టగా తోచక మానదు. మన వ్యక్తిత్వాలనే మట్టివిగ్రహాలను శ్రీసాయిలీలా శ్రవణ-మననమనే మహా సాగరంలో విలీనం చేయవలసిన తరుణమొచ్చింది. అప్పటికిగాని నిజమైన భగవతారాధన పరిపూర్తి చెందదు. వ్యక్తి ప్రాధాన్యం గల నేటి రీతులన్నీ వెనుకటి వాటి వలెనే కాలగతిలో కరిగిపోతాయి. ప్రకృతి ధర్మంలా శాశ్వతంగా ఆధ్యాత్మ జీవితాన్ని శాసించగలవు సాయి ధర్మసూత్రాలు. మనకొకవంక యీ సూత్రం దొరికింది. మరొకవంక మన మేమాత్రం చైతన్యవంతులమైనా సర్వ రూపాలూ, యావద్విశ్వమూ తమ రూపమేనని అపూర్వమైన రీతిన సామాన్యులకు సైతం అనుభవమిచ్చిన అద్వితీయమూర్తి దొరికారు. మహాసమాధి అనంతరం గూడ అవసరమైనపుడు భౌతికంగా గూడ మన ఎదుట నుండగల మహనీయ మూర్తి యాయన. ఆయన జీవితమే ఈ నూత్న సిద్ధాంతానికి తార్కాణం. ఇంకేమి కావాలి? బోధించాలి?!

ద్వారకామాయి అనుభవమండపము

శ్రీ జగదీష్ మురారి, అద్దంకి

నేను డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు మా స్నేహితులు కొందరితో కలసి మొట్టమొదటిసారిగా ఒంగోలు, లాయరు పేటలోని సాయిబాబా గుడికి వెళ్లాను. నేను గుడిలో ప్రవేశించేసరికి పల్లకి సేవ జరుగుతోంది. 'దిగంబరా, దిగంబరా! శ్రీపాదవల్లభ దిగంబరా!' అన్న భజన జరుగుతోంది. నేనుకూడా ఆ పల్లకితో పాటు ప్రదక్షిణ చేస్తూ గుడి వెనుకవైపుకు వెళ్లి, పూజ్యశ్రీ మాస్టరుగారి చిత్రపటం చూసాను. చాలా సమ్మోహనంగా వుండి, ఆలానే చూస్తూ వుండిపోవాలనిపించింది. ఇక అప్పటి నించి, ప్రతిరోజూ గుడికి వచ్చేవాడిని. కానీ బాబా దగ్గరకి వెళ్లకుండా పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకి తిన్నగా వెళ్లిపోయేవాడిని. ఇలా చాలా రోజులు జరిగింది. రోజూ వెళ్లడం వల్ల అక్కడి సేవకులతో పరిచయం అయ్యింది. ఫణి అన్నతను 'శ్రీ గురుచరిత్ర' గ్రంథం యిచ్చి పారాయణ చేసుకొమ్మన్నారు. మన గురువెవ్వరో తెలుసుకోవాలంటే ఆ గ్రంథం పారాయణ చేయాలని చెప్పారు. నేను చాలా ఉత్సుకతతో మూడు రోజులలోనే పారాయణ పూర్తిచేశాను. కానీ నాకేమీ అనుభవం కాలేదు. తరవాత జయరాంగారు శ్రీ సాయిలీలామృతం గ్రంథం యిచ్చి, 'ఇదికూడా మాస్టరుగారు రచించినదే' అని చెప్పారు. ఆ గ్రంథం పారాయణ చేస్తున్నప్పుడు, నాకు చాలా ఆశ్చర్యంగా వుండేది, ఈయన యింత వివరంగా ఎలా రాశారు, బాబా పక్కనే మాస్టరుగారు వుండి చూసి రాశారా అనిపించేది. పైగా కొన్ని సంఘటనలు బాబా చెప్పాక తిరిగి మాస్టరుగారు చెప్పడం,,,, అంటే గులాబీ అన్న పేరు సూచించే విషయం లాంటివి చదువుతుంటే, 'వారే వీరా' అన్న అనుమానం వచ్చేది. ఆ గ్రంథ పారాయణ పూర్తయిన రెండురోజులకి దత్తస్వామి స్వప్న దర్శనమిచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారే నా గురువని సూచించారు. ఇక అప్పటినించి రోజూ గుడికి వెళ్లి పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావనంలో కొన్ని సేవలు చేస్తుండేవాడిని. కానీ బాబా మందిరంలోకి వెళ్ళేవాడిని కాదు.

ఒకరోజు ఒక స్వప్నం వచ్చింది. అందులో నేను ఉదయమే బాబా గుడి తోటలో పువ్వులు కోస్తున్నాను. ఈలోపు బాబాగారు పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధినించి బయటకొచ్చి నా దగ్గరకి వచ్చి, 'జగదీష్ పువ్వులు కోయడం అయిపోయిందా' అనడిగారు, 'ఆ,, కోస్తున్నానండి, అష్టోత్తరానికే కదా తీసుకొస్తాను, మీరెళ్ళి కూర్చోండి' అన్నాను. ఆయన మళ్ళీ తిన్నగా పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధిలోకి వెళ్లి పడుకున్నారు. ఇదంతా నేను ఆ తోటలో నించి చూస్తున్నాను. వెంటనే ఆ బుట్ట అక్కడపెట్టేసి, సమాధిలోకి చూద్దామని ఆతృతగా అక్కడకి వచ్చాను, కానీ అక్కడెవరూ లేరు! ఇదీ నాకు వచ్చిన మొట్టమొదటి స్వప్నం.

మర్నాడు మళ్ళీ జయరాంగారు నాతో, "జగదీశ్ ఇక్కడ ఉదయం కూడా సేవలుంటాయి. నీకు వీలయితే వచ్చి చేసుకోవచ్చు" అన్నారు. ఆయన ఆరు గంటలకి రమ్మంటే, నేను ఐదు గంటలకే వెళ్లి కూర్చునేవాడిని. ఇలాగే ఒకరోజు ఉదయం నేను వెళ్లేసరికి శేషమ్మగారనే సేవకురాలు నన్ను పిలిచి పూలబుట్ట యిచ్చి "తోటలోకెళ్లి పువ్వులు కోసుకునిరా, నాకు వేరే సేవ వుంది" అని చెప్పారు. నేను పువ్వులు

కోస్తున్నప్పుడు, ఇంతకుముందు వచ్చిన స్వప్నం నాకు గుర్తుకువచ్చింది, వెంటనే సమాధి మందిరంలోకి చూసాను. స్వప్నంలో బాబాగారు సమాధి నించి బైటికి వచ్చి, మళ్ళీ సమాధిలోకి కదా వెళ్లిపోయారని గుర్తుకు రాగానే, గబగబా సమాధిమందిరానికి వెళ్లి, బాబా అందులోకి వెళ్లిన దృశ్యాన్ని ఊహించుకుని, చాలా ఆనందపడిపోతూ నా చేతిలో పూల బుట్ట అక్కడే పెట్టేసి, అక్కడినించి బాబా మందిరంలోకి వెళ్లాను. ఇంకా తెల్లవారలేదు. హారతి కూడా మొదలవ్వలేదు. ఎవ్వరూ లేరు. బాబాని తనివితీరా ఆనందంగా చూసుకున్నాను. చాలా చాలా అందంగా వున్నారనిపించింది. తెల్లటి వస్త్రాలలో స్వచ్ఛంగా అందంగా వున్నారు. ఆరోజు నించి రోజూ బాబా గుళ్ళోకి కూడా వెళ్ళేవాడిని.

తరవాత కొన్నాళ్ళకి మా మావయ్య మమ్మల్నందరిని శిరిడీకి తీసుకెళ్లాడు. మా కుటుంబమంతా కలిసి వెళ్ళాము. అది 2004వ సంవత్సరం. అక్కడికెళ్ళాక తెలిసో తెలియకో నేనొకటి అనుకున్నాను. ఏమనంటే - బాబా నాకు ప్రత్యక్షంగా దర్శనం ఇవ్వాలని. దానికోసం లీలామృతము పారాయణ మొదలు పెట్టాను. నిల్చున్నా, కూర్చున్నా, దర్శనానికి వెడుతున్నా పారాయణ చేస్తూనే వుండేవాడిని. మేము రెండు రోజులే వున్నాము. మొదటి రోజు శేజ్ ఆరతి అయ్యాక నా పారాయణ పూర్తయ్యింది. హారతి అయ్యాక మా బసకి నడుచుకుంటూ వెడుతున్నాము. నేను లోపల బాధపడుతున్నాను. నేను బాబా దర్శనం కోరుకుని లీలామృతం పారాయణ చేసాను. కానీ కనపడలేదు అలా కోరుకోకూడదు కాబోలనుకుంటూ నడుస్తున్నాను. కాసేపటిలో నా ఎదురుగా కొంచెం దూరంలో బాబా ప్రత్యక్షం అయ్యారు. చాలా స్పష్టంగా కనిపించారు. నా వైపు చూసి నవ్వారు. నేను వెంటనే పరిగెత్తి ఆయన దగ్గరకి వెళ్లాను. ఆయన మాయం అయిపోయారు. నేను ఆనందంలో ఉబ్బితబ్బిబ్బై పోయాను,

ఇంతలో నా మనసులో ఒక ఆలోచన వచ్చింది. ఇక్కడే కదా బాబా నిలబడ్డారు, వారి కాళ్ళ కింద మట్టి తీసుకుందామని కిందకి వంగాను. ఇంతలో మా నాన్న పరుగున అక్కడకి వచ్చి, "ఏమయిందిరా అలా పరిగెత్తుకుంటూ వచ్చావ్?" అనడిగారు. "ఏమీలేదు నాన్నా, ఇదంతా బాబా తిరిగిన ప్రదేశం కదా, ఇక్కడి మట్టి తీసుకుందామని తొందరగా వచ్చాను" అని చెప్పాను. మా నాన్న నన్ను పిచ్చివాడిని చూసినట్టు

చూసారు. నేను గుప్పెడు నిండా మట్టి తీసుకుని , మా నాన్నని ఏదైనా కాగితం ఇమ్మని అడిగాను. మా నాన్న కాగితం ఇస్తే అందులో వేసేసరికి అది విభూది! మేమందరం చాలా ఆశ్చర్యపోయి, మళ్ళీ అక్కడ చూస్తే మామూలు మట్టే వుంది. నా భ్రమ కాదు, నిజంగా ఆయనే వచ్చారు అని నిరూపణ అయ్యింది.

తరవాత నేను M.C.A. చదువుకోవడానికి హైదరాబాద్ వచ్చాను. అప్పుడు చాలాసార్లు శిరిడి వెళ్ళేవాడిని. వారానికి రెండుసార్లు కూడా వెళ్ళేవాడిని. మొదటిసారి నేనొక్కడినే శిరిడీకి బయలుదేరాను. నాగరసోల్ వరకు టిక్కెట్టు కొనుక్కున్నాను. అది యెంత దూరంలో వుంది, ఎప్పుడు వస్తుందనేది తెలియదు. మాటిమాటికీ అందరినీ 'నాగరసోల్ వచ్చిందా?' అని అడుగుతుంటే వాళ్ళు నన్ను వింతగా చూసేవాళ్ళు. కాస్సేపటికి నామీద నాకే చిరాకువచ్చి, పూజ్యశ్రీ మాస్టరుగారు అన్నట్లు, ఆయన పిలుపు లేనిదే ఎవ్వరూ శిరిడీకి పోలేరు. నన్ను రమ్మని చెప్పిన ఆయనే, నాగరసోల్ వచ్చినప్పుడు లేపుతారని పై బెర్త్ మీదకి వెళ్లి పడుకున్నాను. కొంత సేపటికి బాబా కలలోకి వచ్చి, "ఇది ముందే ఏడిస్తే ఇంత బాధ వుండేది కాదు కదరా" అన్నారు. మర్నాడు ఉదయం కాఫీ, టీ అమ్మే అతను నా బెర్త్ దగ్గరకి వచ్చి, "నాగరసోల్ ఆయేగా వుహో" (నాగర్సోల్ వస్తోంది, లే) అని రెండుసార్లు అరచి వెళ్ళిపోయాడు. నేను హాయిగా రైలు దిగి శిరిడి వెళ్లాను.

నేను ఎప్పుడు శిరిడీకి వెళ్లినా సొంతంగా చపాతీలు తయారుచేసుకుని కొంచం చక్కెర కూడా తీసుకెళ్ళేవాడిని. అది కూడా ఎనిమిది చపాతీలు చేసేవాడిని. ఎందుకంటే, గురుస్థానం దగ్గర రెండు, ద్వారకామాయి దగ్గర రెండు, చావడి దగ్గర రెండు, సమాధి మందిరం దగ్గర రెండు చపాతీలు ఒక కాగితంలో కొంచెం చక్కెర వేసి పెట్టేవాడిని. ఒకసారి శిరిడీ వెళ్ళినప్పుడు, అన్నిచోట్లా ఇచ్చి, ద్వారకామాయిలో ఇవ్వడం మర్చిపోయి బైటికి వచ్చేసాను. నా వెనకే ఒకతను నా వీపుమీద కొట్టి చెయ్యి చాపి ఏదైనా ఇవ్వమని అడుగుతున్నాడు. నేను డబ్బులు అడుగుతున్నాడేమో అనుకుని, వెనుతిరిగి నడుస్తూ, వీళ్ళకి డబ్బులిస్తే వృధా చేసుకుంటారు, ఏమైనా తినడానికైతే ఫరవాలేదు అనుకుంటుంటే, వెంటనే పెద్దగా 'నాకు డబ్బులవసరం లేదు, ఏదైనా తినడానికి ఇస్తే చాలు' అని అరిచాడు. నేను వెంటనే ఆయన దగ్గరకివెళ్ళి "టీ తాగుతారా?" అని అడిగాను. ఆయన 'నాకు టీ వద్దు నీ సంచీ లోని చపాతీ ఇవ్వు' అన్నారు. నా దగ్గర చపాతీలు లేవుకదా అన్ని చోట్లా ఇచ్చేసాను కదా అనుకుంటూ సంచీలో చెయ్యి పెట్టగానే, రెండు చపాతీలు వున్నాయి. 'అయ్యో! ద్వారకామాయిలో ఇవ్వడం మర్చిపోయినట్లున్నాను' అనుకుని, అవితీసి అతనికి ఇచ్చాను. వెంటనే అతను అక్కడే కూర్చుని, 'యే ఆంధ్రా చపాతీ' అనుకుంటూ తింటున్నారు. వెంటనే తింటున్నందుకు నాకు ఆనందం వేసి, ఆయనతో మాటకలుపుతూ, 'మీరెక్కడుంటారు' అని అడిగాను. వెంటనే ఆయన ద్వారకామాయి వైపు చూసి, "యే మేరా ఘర్ హై" (ఇది నా ఇల్లు) అన్నారు. నేను వెంటనే, "అబ్బా, భలే చెప్తారులే, అక్కడవుంటే ఊరుకుంటారేమిటి, తన్ని తరిమేస్తారు" అన్నాను, అప్పుడాయన పెద్దగా నవ్వి, "ఇక్కడ నన్ను తన్ని తరిమేసే మగాడున్నాడురా?" అన్నారు. నేనేమో, సరేగానీ, ఇంతకీ మీ ఇల్లెక్కడ అని మళ్ళీ అడిగాను, ఆయన చిరాకుగా "చలే జావ్ ఇదర్ సే, మే పెహలే బోలా న, యే మేరా ఘర్ హై" (ఇక్కడి నుంచి వెళ్ళిపో. నేను ముందే చెప్పానుగా ఇది నా ఇల్లు అని) అన్నారు. అప్పుడు నేను, "చిరాకు పడకయ్యా, మీ యిల్లు ఎక్కడో చెప్తే, ఈసారి వచ్చినప్పుడు నీకు కూడా చపాతీలు తీసుకువద్దామని అడిగాను" అని అక్కడనించి వచ్చేసాను. నేను తిన్నగా మహాల్సాపతి గారి ఇంటికి వచ్చి అక్కడ కూర్చుని సాయిలీలామృతము పారాయణ చేద్దామని గ్రంథం తియ్యగానే, కొద్దిసేపు క్రిందట జరిగినదంతా గుర్తుకు వచ్చి, మీ ఇల్లు ఎక్కడ అంటే ద్వారకామాయి చూపించి 'యే మేరా ఘర్ హై' అన్నారన్నది గుర్తుకొచ్చి, పరిగెత్తుకుని అక్కడకి వెళ్లాను. అక్కడ అలాంటి వ్యక్తులెవ్వరూ లేరు. ఇప్పటికీ ఆ సంఘటన తలచుకుంటే నా మనసు ఆనందడోలికల్లో తేలిపోతుంది.

అస్సలు బాబా గుళ్ళోకి వెళ్లని నాకు స్వప్నంలో, వీరి సమాధిలోకి వారు వచ్చినట్లు దర్శనం ఇచ్చి, నన్ను బాబా వైపుకి మరల్చారు మాస్టరు గారు. బాబా వారేమో వారి చరిత్ర పారాయణ, గురుచరిత్ర పారాయణ చేసాక మాస్టారే నా గురువని తెలియచేసారు. కాబట్టి నాకు నూటికి నూరుశాతం బాబా, మాస్టరుగారు సరి సమానం! మాస్టరుగారు బాబా సరి సమానం అన్నది నా ప్రగాఢ విశ్వాసం!!

ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీమతి భార్గవి, ఒంగోలు

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని ఒంగోలు సత్సంగసభ్యురాలు శ్రీమతి భార్గవిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు--

నా ఇంటర్మీడియట్ చదువుకోసం మా కుటుంబం ఒంగోలుకు వచ్చాము. మా ఇంటికి దగ్గరలోనే పూజ్యశ్రీ మాస్టరుగారు బృందావనంలో కొలువై వున్న బాబా మందిరం వుంటుంది. నాకు అప్పటికి పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి ఏమీ తెలియదు. కానీ ప్రతిరోజూ బాబా గుడికి మాత్రం వెళ్ళేదాన్ని. నేను, అమ్మ, అన్నయ్య కలిసి వుండేవాళ్ళం. మా నాన్నగారు లేని కారణంగా మేము చాలా సమస్యలు ఎదుర్కోవలసి వచ్చేది. బాబా గుడికి వెళ్ళి ఆయనతో నా సమస్యలన్నీ చెప్పుకునేదాన్ని.

అప్పట్లో పక్కవూరినుంచి సుబ్బారావుగారు తరచుగా బాబా గుడికి వచ్చేవారు. ఒకసారి ఆయన చేతిలోవున్న శ్రీ సాయి లీలామృతం గ్రంథం చూసి, దాని మీద వున్న బాబా ముఖచిత్రం చాలా బాగుందని ఆయనతో చెప్పాను. ఆయన, "ఈ గ్రంథం వ్రాసినది వెనుకవైపు వున్న సమాధి మందిరంలో విరాజిల్లుతున్న పూజ్యశ్రీ భరద్వాజగారే!" అని చెప్పి, ఆ గ్రంథం చదువుకొమ్మని నాకు యిచ్చేశారు. అప్పటినుంచి నేను పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధిమందిరం దగ్గర కూర్చుని పారాయణ చేసుకోవడం మొదలుపెట్టాను.

పూజ్యశ్రీ మాస్టరుగారు నా ప్రతి ఆలోచనకీ ప్రతిస్పందించేవారు. అది యిప్పటికీ కొనసాగుతూనే వుంది. ఒకసారి పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణం జరుగుతోంది. మా అమ్మ ఆ కళ్యాణానికి వెళదాము రమ్మంది. నేను పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరానికి వెళ్ళి పారాయణ చేసుకుంటానన్నాను. ఇక ఆమె కూడా నాతోపాటే వచ్చింది. గుడిలో ఒకాయన మా దగ్గరకి వచ్చి తన దగ్గర ఒక పాస్ వుందని, ఎవరైనా ఒకరు కళ్యాణానికి వెళ్ళవచ్చనీ చెప్పారు. అపుడు మా అమ్మ ఆ పాస్ తీసుకొని అక్కడకు వెళ్ళింది. నేను పూజ్యశ్రీ మాస్టరుగారి ఎదురుగా కూర్చుని 'సాయిసన్నిధి' గ్రంథం చదువుకుంటున్నాను. సాయంత్రం 5 గంటల సమయంలో శ్రీ అనంతకృష్ణగారు, వారి శ్రీమతి, ఇంకొంతమంది, పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దర్శనానికి వచ్చారు. ఆయనను చూడగానే పూజ్యశ్రీ మాస్టరుగారిని చూస్తున్నంత ఆనందం వేసి వెంటనే వెళ్ళి నమస్కారం చేసుకున్నాను. ఆయన నాకు కుంకుమ, అక్షింతలు, కొబ్బరి చిప్ప ప్రసాదంగా యిచ్చారు. ఆశ్చర్యమేమిటంటే, కళ్యాణానికి వెళ్ళిన మా అమ్మకి కూడా అవే ప్రసాదంగా యిచ్చారు. ఇదంతా పూజ్యశ్రీ మాస్టరుగారి లీలా వినోదం అనిపించింది.

ఇంకొకసారి నేను, మా అమ్మ, మా పిన్ని శ్రీపాదస్వామి దర్శనానికి పిఠాపురం వెళ్ళాము. తిరిగి వచ్చేటప్పుడు విజయవాడ వెళదామని రైలు ఎక్కడానికి స్టేషనుకి వచ్చాము. మా అమ్మ ముందుగా రైలు ఎక్కేసింది. నేను రైలు ఎక్కుతూ క్రింద పడిపోయాను. పిన్ని నాతో వుండిపోయింది. రైలు కదిలింది. చాలా రద్దీగా వుండడంవల్ల మా అమ్మ వెనుక బోగీలో మేము ఎక్కామనుకుంది. నాకు చాలా భయం వేసింది. ఎందుకంటే ఆమె సెల్ ఫోన్, డబ్బులు... అన్నీ నా దగ్గరే వున్నాయి.

ఈలోపు వెనుక వేరొక రైలు వస్తే అక్కడ వున్నవారి సలహా మేరకు మేము దాన్ని ఎక్కాము. కానీ మా అమ్మకి ఈ విషయం ఎలా చెప్పాలో తెలియదు. నా మెళ్ళో వున్న పూజ్యశ్రీ మాస్టరుగారి లాకెట్టును గట్టిగా పట్టుకుని, "ఇప్పుడు మీరు ఏం చేస్తారో తెలియదు, మా అమ్మ నాతో మాట్లాడాలి!" అని చెప్పుకొని ఏడుస్తున్నాను. ఇంతలో మా ఎదురుగా యిద్దరు వ్యక్తులు వచ్చి కూర్చున్నారు. ఒకాయన తలపాగా పెట్టుకున్నారు. ఆయన "నీదగ్గరున్న ఫోనులన్నీ బయటకు తీసిపెట్టుకో. ఎవరిద్వారానైనా ఫోన్ చేయిస్తారేమో!" అన్నారు. ఆయన చెప్పినట్లు సంచీలోనించి ఫోన్లన్నీ బయటికి తీశాను. వెంటనే నా దగ్గరున్న మా అమ్మ ఫోన్ మ్రోగింది. నేను ఫోన్ ఎత్తి జరిగిన విషయం చెప్పి, విజయవాడలో రైలు దిగమని చెప్పాను. ఏమీ తెలియని మా అమ్మకి ఆ సమయంలో తన ఫోను నెంబర్ గుర్తుండటం, ఎదుటివాళ్ళని ఫోన్ చెయ్యమని అడగటం... ఇదంతా పూజ్యశ్రీ మాస్టరుగారి లీలే అనిపించింది. పైగా నా ఎదురుగా కూర్చున్నాయన 'భయపడవద్దు, మీ అమ్మగారే ఫోన్ చేస్తా' రని సలహా యివ్వడం యింకా ఆశ్చర్యం వేసింది. ఈవిధంగా కష్ట పరిస్థితిలో పూజ్యశ్రీ మాస్టరుగారు మమ్మల్ని ఆదుకుంటున్నారు.

2006లో నేను నా P.G. చదువు పూర్తిచేసుకున్నాను. మొదటి సెమిస్టర్ పరీక్షలకు నేను బాగా కృషి చేశాను. కానీ అకస్మాత్తుగా నాకు అమ్మవారు పోసి చాలా జ్వరం వచ్చింది. మర్నాడు పరీక్ష అనగా పూజ్యశ్రీ మాస్టరుగారికి ప్రార్థన చేసుకున్నాను. "మాస్టరుగారూ! నేను పరీక్షకు హాజరయ్యేటట్లు మీరే చేయాలి. మీమీదే భారం వేస్తున్నాను" అని నమస్కారం చేసుకుని పడుకున్నాను. తెల్లవారుఝాముున 4-30 నిముషాలకు జ్వరం తగ్గిపోయి బాగా చెమటలు పట్టి మెలకువ వచ్చింది. అప్పుడు లేచి చదువుకుని పరీక్షలు వ్రాశాను. ఫలితాలలో నేను ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణురాలినైనట్లు ప్రకటించారు. ఇదంతా పూర్తిగా పూజ్యశ్రీ మాస్టరుగారి దయే! వెంటనే నాకు అక్కడే లెక్చరర్ ఉద్యోగం కూడా వచ్చింది.

నా పెళ్లి విషయంలో కొంచెం ఆందోళనగా వుండేది. అప్పుడు మా సత్సంగ సభ్యుల సూచన మేరకు శ్రీ సాయి లీలామృతం పారాయణలు చేద్దామని నిర్ణయించుకున్నాను. ఆ రోజు పరిప్రశ్న గ్రంథం తెరిస్తే అద్భుతంగా ఒక వాక్యం కనిపించింది. ఒకమ్మాయి అడిగిన ప్రశ్నకు పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధానమిస్తూ, 'ఎవరికి, ఎప్పుడు, ఎవరితో వివాహం జరగాలన్నది కేవలం ఋణానుబంధం, పూర్వకర్మవల్ల జరుగుతుందని, కాబట్టి దాని గురించి ఎక్కువ ఆలోచించకూడదనీ' చెప్పారు. ఇంక ఎక్కువ ఆలోచించకుండా ఇష్టమైన పదార్థం వదిలి పారాయణ చేయడం మొదలుపెట్టాను.

మా మామయ్య విద్యానగరు స్టేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నప్పుడు, 1988లో మా తాతగారు ఒకసారి అక్కడకి వెళ్లారట. తిరిగి బయలుదేరేటప్పుడు గురుబంధువులొకరు ఒక కట్ట శ్రీ సాయిలీలామృతం గ్రంథాలు ఆయనకిచ్చి, "మీరు ఒంగోలు వెళుతున్నారు కదా! పూజ్యశ్రీ మాస్టరుగారికి ఈ గ్రంథాలు అందచేయండి" అని చెప్పారట. మా తాతగారు అందచేశారట. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ గ్రంథాలలో ఒక గ్రంథం మీద, "శ్రీ సాయినాథానుగ్రహ ప్రాప్తిరస్తు!" అని వ్రాసి మా తాతగారి కిచ్చారట. రెండు పారాయణలు చేసుకుని, అప్పటినుంచి ఆ గ్రంథాన్ని భద్రపరిచిన మా అమ్మమ్మ ఆ గ్రంథాన్ని నాకు యిచ్చేసింది. నా వివాహం కోసం చేసే పారాయణ ఆ గ్రంథంతోనే మొదలుపెట్టాను. ఒక సప్తాహం పారాయణ పూర్తయ్యాక, రాత్రి స్వప్నంలో చాలామంది దిగంబరంగా వున్న మహాత్ములు దర్శనమిచ్చారు. వారిలో ఒకరు హారతిస్తూ, ఈరోజు నువ్వు పూజలో హారతి యివ్వడం మర్చిపోయావని చెప్పారు. మెలకువ వచ్చాక అది నిజమేనని గుర్తొచ్చింది! నాకు 2016లో వివాహమైంది. పూజ్యశ్రీ మాస్టరుగారు ఘటనాఘటన సమర్థులు.

నేను 2009లో పూజ్యశ్రీ అమ్మగారిని మొట్టమొదటిసారి దర్శించుకున్నాను. అప్పటినుంచి వారు నన్ను ఎంతో ప్రేమగా ఆదరించి, చాలా సందర్భాలలో నాకు సరైన సలహాలిచ్చి నన్ను నడిపించారు. పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను పూజ్యశ్రీ అమ్మగారికి అప్పచెప్పారనిపిస్తుంది. అంతటి గురుదంపతులను జీవితాంతం సేవించుకుని, వారి మార్గంలో ఏమారకుండా నడిచేటట్లు ఆశీర్వదించమని వేడుకుంటూ కృతజ్ఞతాంజలి సమర్పిస్తున్నాను.

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

SRI GURUPADUKA PUBLICATIONS, C/o.SRI MANGA BHARADWAJA TRUST

Regd.Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68.

Phone: +91 - 74160 41550

Branch Office : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh.

Phone:08592 233271

Send DD in favour of **"Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad or Ongole.**

శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర (Bound)	450-00
శ్రీ సాయి లీలామృతం	150-00
శ్రీ గురు చరిత్ర	150-00
శ్రీ సాయి సన్నిధి	120-00
శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు	125-00
శ్రీ సాయినాథ ప్రభోధామృతము	80-00
సాయినాథ పూజ	40-00
సాయినాథ స్థవనమంజరి	10-00
శిరిడి ఆరతులు	15-00
సాయిబాబాను సేవించడమెందుకు	10-00
సత్సంగము - భజన	5-00
శిరిడి క్షేత్ర సందర్శనము	40-00
విజ్ఞాన వీచికలు	99-00
పరిప్రశ్న	99-00
మతమెందుకు?	20-00
ఏది నిజం?	25-00
ధ్యానయోగ సర్వస్వం	99-00
బుద్ధధ్యాన హృదయం	49-00
దత్తావతార మహత్త్వం	75-00
సంహితాయన గురు ద్విసాహస్రి	125-00
పురుషసూక్త రహస్యం	40-00
సాయిసూక్తి - ఆచార్యవాణి	10-00
శ్రీ పాకలపాటి గురువుగారు	49-00
అవధూత శ్రీ చీరాలస్వామి	49-00
అవధూత శ్రీ వెంకయ్యస్వామి	70-00
శ్రీ ఆనందమాయి అమ్మ	49-00
టిబెట్ యోగి మిలారేపా చరిత్ర	80-00
శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర	49-00
స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి)	49-00
మనము - మన సంస్కృతి	70-00

ఇతర ప్రచురణలు

మహాత్ముల ముద్దుబిడ్డడు	120-00
అవధూత చివటం అమ్మ	70-00
శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర	70-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-1	125-00
మరో నందదీపం	80-00
ఆచార్య అమృత లేఖావళి	40-00
భగవాన్ శ్రీ భరద్వాజ	175-00
బాలల శ్రీ సాయి లీలామృతము	25-00
మహాపురుషుడు	50-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-2	125-00
బాలల శ్రీ సాయి సన్నిధి	50-00
బాలల శ్రీ గురు చరిత్ర	50-00
శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము	15-00
మాష్టారు అమృత వాక్కులు	100-00

BOOKS IN ENGLISH

Sai Baba the Master	175-00
Sree Guru Charitra	99-00
Supreme Master (Swami Samartha)	99-00
Sai Baba of Shiridi and His Teachings	99-00
Life and Teachings of Hazarat Tajuddin Baba	99-00
Children's Sai Baba the Master	60-00

BOOKS IN OTHER LANGUAGES

Sadguru Sai Baba (Hindi)	150-00
Sai Leelamrutham (Kannada)	150-00
Sai Baba Jeevitha Charitham (Malayalam)	220-00
Sai Baba Leelamrutham (Tamil)	175-00
Sri Guru Charitra (Hindi)	99-00
Swami Samartha (Kannada)	50-00
Sri Guru Charitra (Kannada)	99-00
Shiridi Aarathi (Tamil)	15-00
Stavana Manjari (Tamil)	10-00
Tibet Yogi Milarepa Jeevitha Charitra (Kannada)	55-00
Sri Sainath Prabodhamruthamu (Kannada)	65-00
Sai Sannidhi (Kannada)	120-00
Sri Guru Charitra (Malayalam)	150-00
Sri Guru Charitra (Oriya)	150-00

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.

మార్చి 5, 6 (2023) తేదీలలో మన గురు దంపతులైన పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి మరియు పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ ల లీలా కళ్యాణ మహోత్సవము ఒంగోలు సమీపంలోని సంత నూతలపాడు మండలం, గుమ్మళంపాడు గ్రామ శివారులో గల 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము' లో భక్తి జ్ఞాన ప్రబోధాత్మకంగా, అత్యంత వైభవంగా, మహాద్భుతంగా, కన్నులపండుగగా జరిగింది.